
ఆదివారం 23, మార్చి 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**ఐపీఎల్ అట్టహాసంగా ఆరంభం**
తొలి మ్యాచ్‌లో కోల్‌కతాపై ఆర్సీబీ ఘన విజయం
14

### కేంద్రం నుంచి రావాల్సిన..
# నిధులు తెచ్చుకోవాలి
**- ఆర్థిక శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు**



హైదరాబాద్ (చైతన్యరథం): మరో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖలో స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష జరిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం నిర్వహించిన సమీక్షలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అధికారులతో చర్చించారు.

కేంద్రంలోని ఆయా శాఖల నుంచి రావాల్సిన నిధులు విడుదలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించి.. సకాలంలో నిధులు విడుదల అయ్యేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నిధులు రావాల్సి ఉందని అధికారులు తెలపగా... కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఆర్థిక సంవత్సరం ముగింపులోగా నిధులు తెచ్చుకోవాలని అదేశించారు. హైదరాబాద్ లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమీక్షలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ సెక్రటరీ రోనాల్డ్ రోస్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, సీఎంవో అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# పుడమి తల్లిని పరిరక్షించుకుందాం

60 EARTH HOUR

- ప్రపంచ నీటి దినోత్సవం, ఎర్త్ అవర్ ఒకేరోజు రావటం సంతోషం
- అన్ని జీవరాసులకు ఏకైక ఇల్లు భూమి
- అందరం కలిసి కాపాడుకుందాం
- చిన్న ప్రయత్నాలతోనే పెనుమార్పులు
- అందరూ కలిస్తేనే బంగారు భవిష్యత్
- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పిలుపు

2

### అంబేద్కర్ విగ్రహానికి అవమానం..
# సీఎం చంద్రబాబు ఖండన

- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలి
- వైషమ్యాలు రెచ్చగొట్టేవారిపై నిఘా ఉంచాలి
- డీజీపీతో సమీక్షలో సీఎం ఆదేశాలు

2

## మనోధైర్యంతో ఉండాలి
- మంత్రి ఫరూక్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

2



### రాజకీయాలు ఎన్నికలకే పరిమితం..
# ప్రభుత్వం శాశ్వతం

- జగన్ రెడ్డి ఇప్పటికైనా తెలుసుకోవాలి
- ప్రభుత్వం మారినా.. అభివృద్ధి, సంక్షేమాలు కొనసాగించటం పాలకుల బాధ్యత
- ప్రజాస్వామ్య స్ఫూర్తిని జగన్ విధ్వంసపాలనతో బ్రేక్ చేశారు
- వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మేము చెల్లిస్తున్నాం
- చివరి రూపాయి వరకూ చెల్లిస్తాం
- మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ

- వివరాలు 2లో...



### ప్రభుత్వ పాఠశాలల్లో..
# ప్రతి శనివారం నో బ్యాగ్ డే
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- మంత్రి నారా లోకేష్ వెల్లడి

2



## భూగర్భ జలాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృషి
4
- కరువు ప్రాంతాల్లో పంట కుంటలు,చెక్ డ్యాముల నిర్మాణం
- మంత్రి డోలా

### కూటమి ప్రభుత్వ లక్ష్యం..
## ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం
3
- ఉప ముఖ్యమంత్రి పవన్ ఉద్ఘాటన

## ధాన్యం కొనుగోళ్లలో కొత్త చరిత్ర
5
- రూ.8003 కోట్ల మేర ధాన్యం కొనుగోలు చేయడం రికార్డు
- మంత్రి నాదెండ్ల మనోహర్

# మనోధైర్యంతో ఉండాలి

- మంత్రి ఫరూక్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ




హైదరాబాద్ (చైతన్యరథం): ఏపీ మైనారిటీ సంక్షేమ శాఖామంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఫరూక్ సతీమణి షెహనాజ్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఫరూక్ నివాసానికి శనివారం వెళ్లిన సీఎం చంద్రబాబు ఫరూక్, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మనో ధైర్యంతో ఉండాలని కుటుంబ సభ్యులతో చంద్రబాబు పేర్కొన్నారు. దాదాపు గంట సమయం పాటు మంత్రి కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు.

కాగా మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ సీ.రామచంద్రయ్య, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, భూమా అఖిలప్రియ, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గిత్త జయసూర్య, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, సీపీఐ నేత రామకృష్ణ, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, టీడీపీ నాయకులు భార్గవ్ రామ్, తుగ్గలి నాగేంద్ర, తిక్కారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మాంద్ర శివానందరెడ్డి, పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మార్కుఫెడ్ మాజీ చైర్మన్ పిపి నాగిరెడ్డి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మంత్రి ఫరూక్‌ను పరామర్శించారు.

# పుడమి పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రపంచ నీటి దినోత్సవం, ఎర్త్ అవర్ ఒకేరోజు రావటం సంతోషం
- అన్ని జీవరాసులకు ఏకైక ఇల్లు భూమి
- అందరం కలిసి కాపాడుకుందాం
- చిన్న ప్రయత్నాలతోనే పెనుమార్పులు
- అందరూ కలిస్తేనే బంగారు భవిష్యత్
- ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పిలుపు




అమరావతి (చైతన్యరథం): అన్ని జీవరాశులకు భూమే ఏకైక ఇల్లని, దాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్బోధించారు. భూమిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చేయగలిగినంత సహాయం చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరం మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం, అలాగే ఎర్త్ అవర్ రెండూ ఒకే రోజు రావడం సంతోషంగా ఉందన్నారు. శనివారం ఎర్త్ అవర్ సందర్భంగా ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. ఏటా ఎర్త్ అవర్ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని 60 నిమిషాల పాటు ఏకం చేస్తోందన్నారు. రాత్రి 8:30 నుంచి 9:30 గంటల వరకూ విద్యుత్ వాడకం ఆపేసి ఎర్త్ అవర్ పాటించటం ఆనవాయితీగా వస్తోంది. ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలు సహా తదితర చోట్ల లైట్లు, విద్యుత్ ఉపకరణాలు ఆఫ్ చేసి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు సంఘీభావం తెలపటం సంతోషకరం.

మానవ జీవితంలో నీరు, విద్యుత్ శక్తి ఎంతో ముఖ్యమైన మూల స్తంభాలు. నీరు, విద్యుత్ శక్తి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. వీటి ప్రాముఖ్యతను గుర్తించడం వల్లే నీరు, ఇంధన భద్రత అంశాలను స్వర్ణాంధ్ర-2047 మార్గదర్శక సూత్రాల్లో పొందుపరిచాం. వీటిని పొదుపుగా వాడుకోవడం ప్రకాశవంతమైన స్థిరమైన భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తుంది. ఈ అంశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోంది. కానీ సమష్టి కృషి ఎంతో అవసరం. ప్రభుత్వంతో కలిసి ప్రతి ఒక్కరూ తమ వంతుగా పని చేసినప్పుడు మాత్రమే లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం. చిన్న ప్రయత్నాలు రేపటి పెద్దపెద్ద మార్పులకు దారితీస్తాయని అందరూ గుర్తించాలి. అంతా కలిసి పని చేస్తే ప్రభావవంతమైన మార్పు తీసుకు రాగలుగుతాం. ప్రతిఒక్కరూ మార్పు కోసం కృషి చేయాలి. అందుకు నా ప్రోత్సాహం ఉంటుంది. ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ పొదుపు విషయంలో అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## అంబేద్కర్ విగ్రహానికి అవమానం..

# సీఎం చంద్రబాబు ఖండన

- డీజీపీతో సమీక్ష.. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశం
- పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలి
- వైషమ్యాలు రెచ్చగొట్టేవారిపై నిఘా ఉంచాలి

అమరావతి (చైతన్యరథం): తూర్పు గోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గం, నల్లజర్ల మండలం, దూబచర్లగాంధీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను సీఎం చంద్రబాబు నాయుడు ఖండించారు. భారతరత్న అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. ఘటనపై డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి...కుట్రతో ఇటువంటి నేరాలకు పాల్పడతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, ఆయా వర్గాల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించే వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేవారిపై నిఘా ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ఈ ఘటనపై పూర్తి వివరాలను సీఎం చంద్రబాబుకు డీజీపీ తెలిపారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# రాజకీయాలు ఎన్నికలకే పరిమితం.. ప్రభుత్వం శాశ్వతం

- జగన్ రెడ్డి ఇప్పటికైనా తెలుసుకోవాలి
- ప్రభుత్వం మారినా.. అభివృద్ధి, సంక్షేమాలు కొనసాగించటం పాలకుల బాధ్యత
- ఆ ప్రజాస్వామ్య స్ఫూర్తిని జగన్ విధ్వంసపాలనతో బ్రేక్ చేశారు
- వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మేము చెల్లిస్తున్నాం
- చివరి రూపాయి వరకూ మొత్తం చెల్లిస్తాం
- మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వం మారినా.. అభివృద్ధి, సంక్షేమాలు కొనసాగించే ప్రజాస్వామ్య స్ఫూర్తిని మీ విధ్వంసపాలనతో బ్రేక్ చేశారని వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డిపై విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ పాలనలో అంతా విధ్వంసానికి పాల్పడ్డారన్నారు. గత ప్రభుత్వ బకాయిలు మేమెందుకు చెల్లించాలనే విధంగా వైసీపీ పాలన సాగిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన మీరు గత ప్రభుత్వ బకాయిలు మేమెందుకు చెల్లించాలి అంటూ మొండికేశారు. టీడీపీ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను నిలిపేశారు. మరికొన్ని ధ్వంసం చేశారు.

ఈ నిరంకుశ మనస్తత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. కానీ గత వైసీపీ ప్రభుత్వం ప్రవర్తించిన విధంగా తాము ప్రవర్తించడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వం వదిలిపెట్టి పోయిన బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్నామని చెప్పారు. మా విద్యాశాఖలో మీరు పెట్టి వెళ్లిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4271 కోట్లు. ఇవి విడతల వారీ చెల్లిస్తామని మాట ఇచ్చాను. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.788 కోట్లు గతంలోనే విడుదల చేసిన మా ప్రభుత్వం తాజాగా రూ.600 కోట్లు విడుదల చేసింది. త్వరలో మరో రూ.400 కోట్లు విడుదల చేస్తాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, మీరు పెట్టిన బకాయిలు ఆర్థిక భారంగా మారినా, చివరి రూపాయి వరకూ బకాయిలు చెల్లించడం, విద్యార్థులు, తల్లిదండ్రుల పై ఎటువంటి ఒత్తిడి లేకుండా చేయడమే మా బాధ్యతగా భావిస్తున్నాం. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం.. ప్రభుత్వం శాశ్వతమనే విషయాన్ని జగన్ మోహన్ రెడ్డి తెలుసుకోవాలని మంత్రి లోకేష్ హితవు పలికారు.



# రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు..

## మంత్రి లోకేష్ ఆందోళన

- మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

అమరావతి (చైతన్యరథం): ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు వద్ద ఆగి ఉన్న లారీని టూరిస్ట్ బస్సు ఢీకొట్టిన ఘటనలో పదిమందికిపై పైగా విద్యార్థులు గాయపడ్డారనే వార్త తనను ఆవేదనకు గురిచేసిందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల బస్సు విహారయాత్రకు వెళ్లి తిరిగొస్తుండగా ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరం అన్నారు. విషయం తెలిసిన వెంటనే రోడ్డు ప్రమాద ఘటనపై అధికారులను అడి వివరాలు తెలుసుకున్నానన్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించానని మంత్రి లోకేష్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో..

# ప్రతి శనివారం నో బ్యాగ్ డే

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు: మంత్రి నారా లోకేష్ వెల్లడి

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇప్పటివరకు నెలలో మూడో శనివారం మాత్రమే ఉన్న 'నో బ్యాగ్ డే'ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి శనివారం అమలు చేస్తామన్నారు. ఆ రోజున పిల్లలు బడులకు బ్యాగులు తీసుకురావాల్సిన అవసరం లేదు. ఆ రోజు ఆ రోజు తరగతులకు బదులుగా ఇతరత్రా పోటీలు.. క్విజ్‌లు, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, క్రీడలు, వివిధ పోటీలు నిర్వహిస్తారు. అందుకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ 2025-26 అకడమిక్ క్యాలెండర్ రూపొందిస్తోంది.

## కూటమి ప్రభుత్వ లక్ష్యం..

# ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం

- ఉప ముఖ్యమంత్రి పవన్ ఉద్ఘాటన
- రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు
- ఉపాధి హామీ పనులతో అన్నదాతల కళ్లలో వెలుగులు నిండాలి
- గత పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం
- వ్యవస్థలను పటిష్టపరుస్తూ ముందుకు వెళుతున్నాం
- అనుభవజ్ఞులైన సీఎం చంద్రబాబు వల్లే పల్లె పండుగ విజయవంతం
- కర్నూలు జిల్లా, పుడిచర్లలో ఫామ్ పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఉప ముఖ్యమంత్రి
- రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శ్రీకారం



కర్నూలు (చైతన్యరథం): రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మా ప్రభుత్వంలో వ్యవస్థలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు.

శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం, పుడిచెర్లలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో సేద్యపు నీటి కుంటల(ఫామ్ పాండ్స్) నిర్మాణానికి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా ఉపాధి హామీ పనులు ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో అనుభవజ్ఞులైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండబట్టే పల్లె పండుగ విజయవంతం అయ్యిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి అంటే రైతన్న బలపడాలి. ఉపాధి హామీ పనులతో అన్నదాతల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలి. అదే కూటమి ప్రభుత్వ ఆశయం అన్నారు. త్వరలో ఒక్కో నియోజకవర్గంలో రెండు రోజులు పర్యటించి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు.

గత ప్రభుత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ ఉపాధి పథకంగా మార్చారు. అలాంటి వాటిని ఎదుర్కోవడానికి బలమైన అధికారులను ఏర్పాటు చేశాం. పల్లె పండుగ పనుల్లో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. కర్నూలు జిల్లాలో రూ.75 కోట్లతో 117 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. రైతులు నీరు నిలవ చేసుకోగలిగితే సమస్య ఉండదు. వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు రూపొందిస్తాం. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పటిష్టపరచిన పాపాన పోలేదు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాం. ఉపాధి హామీ కింద ఇప్పటి వరకు రూ. 9,597 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని పవన్ స్పష్టం చేశారు.

### ఉపాధికి ఊతం..

జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎకరం 30 సెంట్ల భూమిలో 6 సెంట్లలో చెరువు, రెండు సెంట్లలో గట్టు ఉండే విధంగా నిర్మిస్తున్నాం. పుడిచర్ల గ్రామానికి చెందిన రైతు సూర రాజన్నకు చెందిన భూమిలో ఫామ్ పాండ్‌కి భూమి పూజ చేశాం. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలు లబ్ధి పొందుతున్నారు. గ్రామాల్లో పనులు లేక నలిగిపోతున్నవారికి ఉపాధి కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకానికి కావాల్సిన అర్హత కష్టపడి పని చేయడమే. గత ప్రభుత్వంలో ఎవరు లబ్ధిదారులో కూడా తెలియనంతగా అవకతవకలకు పాల్పడ్డారని పవన్ విమర్శించారు.

### రతనాలసీమగా మార్చడమే లక్ష్యం

రాయలసీమలో నేల స్వభావాన్ని బట్టి ఇక్కడ నీటికి కటకట ఉంటుంది. వర్షం వచ్చినా నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. శ్రీకృష్ణ దేవరాయల హయాం మాదిరి రాయలసీమ మళ్లీ రతనాలసీమ కావాలి. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. సీమకు పెద్ద పెద్ద ప్రాజెక్టులు వచ్చేలోపు రైతుల సౌలభ్యం కోసం ఫామ్‌పాండ్స్ నిర్మిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల పాండ్లు మే నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొత్తం పాండ్లు పూర్తయితే ఒక టీఎంసీ నీటి నిల్వకు అవకాశం ఉంటుంది. రైతులంతా బాగుండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల ఏర్పాటును ముందుకు తీసుకువెళుతోందని పవన్ చెప్పారు.

### గ్రామసభలతో ప్రపంచ రికార్డు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒకే రోజు 13, 326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. సీఎం చంద్రబాబు అనుభవాన్ని ప్రేరణగా తీసుకుని ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించడంతో పాటు అభివృద్ధి పనుల జాబితా తీసుకోవడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాం. గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో జాతీయ దినోత్సవాల సమయంలో జెండా పండుగ చేయడానికి రూ. 100 నుంచి రూ. 250 వరకు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఆ ఖర్చుని రూ. 10 వేల నుంచి 25 వేలకు పెంచింది. పంచాయతీరాజ్ శాఖలో సమర్థవంతమైన పాలన అందించేందుకు పునర్నియామకాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నరేగా నిధుల ద్వారా గ్రామాల్లో ఉపాధి కూలీలకు వారి గ్రామాల్లోనే ఉపాధి అందించాం. రూ. 6 వేల కోట్లు నేరుగా కూలీలకు అందించి ఉపాధితోపాటు ఆర్థిక స్థిరత్వం కల్పించే దిశగా అడుగు ముందుకు వేశాం. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 8 నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించాం. వంద మందికి పైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యాలు కల్పించాం. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలు చూడాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో జన్మన్ పథకం కింద విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించామని పవన్ తెలిపారు.

### సమస్యలు పరిష్కరిస్తాం

ఎంపీడీవోల సమస్యలు మా దృష్టికి తెచ్చారు. ఆ సమస్యలకు పరిష్కారం వెతుకుతాం. పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్, గ్రామ సచివాలయం, ఇంజినీరింగ్ అసోసియేషన్ సమస్యలకు పరిష్కారం వెతుకుతాం. ఎస్టీల్లో చేర్చాలంటూ వాల్మీకి బోయ సంక్షేమ సంఘం నుంచి అర్జీ వచ్చింది. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంది. ముఖ్యమంత్రితోనూ, కేబినెట్లోనూ ఈ సమస్యపై మాట్లాడుతాను. రెడ్డి సంఘం నాయకులు కర్నూలు విమానాశ్రయానికి స్వతంత్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు ప్రతిపాదించారు. దాన్ని ముందుకు తీసుకువెళ్తాం. నేను కులాలు, మతాల గురించి మాట్లాడితే చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. నేను ధర్మాన్ని మాత్రం బలంగా పాటిస్తాను. నా స్వధర్మాన్ని పాటిస్తాను. అన్ని ధర్మాలను గౌరవిస్తాను. బీసీ డీ లో చేర్చాలని గాజుల బలిజలు అడిగారు. వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తాను. బుడగ జంగాలకి స్వతంత్ర్య అనంతరం కుల ధృవీకరణ కూడా లేకుండాపోయింది. వారికి న్యాయం చేస్తామని పవన్ హామీ ఇచ్చారు.

### గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్థానిక శాసనసభ్యుల కోరిక మేరకు అభివృద్ధి పనులు ముందుకు తీసుకువెళతాం. పరిమితి మేరకు ప్రణాళికలు రూపొందించుకుని పూర్తి చేస్తాం. ఉపాధి హామీ బకాయిలు రెండు రోజుల్లో జమ అయ్యేలా చూస్తాం. అవసరం అయితే ఈ విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడతాం. కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గతంలో చెప్పాను. ఆ గ్రామ అవసరాలు తీర్చేందుకు సొంత ట్రస్ట్ నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పిస్తాం. ప్రభుత్వం పథకాల ద్వారా చేయదగిన పనులు అధికారులతో మాట్లాడి పూర్తి చేస్తాం. కొణిదెల గ్రామంతోపాటు అన్ని గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాం. ఒక్కో జిల్లాలో రెండు నుంచి మూడు రోజులు ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తామని పవన్ చెప్పారు.

### తలకు పాగా చుట్టి.. గడ్డ పార చేతబట్టి

పంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల (ఫామ్ పాండ్) ప్రారంభోత్సవానికి కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, పుడిచర్లకు వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా ఫామ్ పాండ్ తవ్వకానికి శ్రీకారం చుట్టారు. సొంత వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయం అలవాటు ఉన్న ఆయన తలకు పాగా చుట్టి రైతుగా మారిపోయారు. గడ్డపార చేతబట్టి శంకుస్థాపనకు సిద్ధం చేసిన ప్రాంతంలో గణపతిని పూజించి కుంట తవ్వకాన్ని ప్రారంభించారు. గడ్డపారతో గుంత తవ్వి స్వయంగా మట్టిని పారతో ఎత్తి గంపలో వేశారు. ఉపాధి కూలీలతో కలసి పనిలో పాలు పంచుకోవడంతోపాటు వారందరినీ వేదిక మీదకు పిలిచి లబ్ధిదారులుగా పరిచయం చేశారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, పాణ్యం, నందికొట్కూరు, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, గిత్తా జయసూర్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






# భూగర్భ జలాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృషి

- కరువు ప్రాంతాల్లో పంట కుంటలు, చెక్ డ్యాముల నిర్మాణం
- సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం, భావితరాలకు నీరు అందించాల్సిన బాధ్యత మనదే
- భూగర్భ జలాలు పెంపొందించే క్రతువులో ప్రజలంతా భాగస్వాములు కావాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపు



ఒంగోలు (చైతన్యరథం): భూగర్భ జలాలు పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఒంగోలులోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జల శక్తి కేంద్రాన్ని శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డా. నూకసాని బాలాజీ లతో కలిసి మంత్రి డోలా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాల నమూనాలను పరిశీలించారు. అనంతరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో నిర్మించనున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ప్రకాశం జిల్లా మొత్తం క్షామపీడిత ప్రాంతమని, జిల్లాలో నీటి సంరక్షణ చాలా అవసరం అన్నారు. భావితరాలకు నీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అత్యంత విలువైన సహజ వనరు సంపద ఏదైనా ఉందంటే అది నీరేనని మంత్రి అన్నారు. సమస్త జీవకోటికి నీరే ప్రాణాదారమని, భావితరాలకు నీరందించాల్సిన బాధ్యత మనదే అని మంత్రి అన్నారు. ప్రజలకు జీవనాధారమైన నీటి సంపదను సంరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినడం, పచ్చదనాన్ని నిర్మూలించడం వంటి కారణాలతో నేడు మనమంతా నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయన్నారు. అందులో భాగంగా కరువు ప్రాంతాల్లో పంటకుంటలు, చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణాలతో పాటు ఇంటిపై రూఫ్ వాటర్‌ని నిల్వ చేసేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. జిల్లాలో నీటి గణాంకాల ప్రకారం 12 మండలాల్లో 93 గ్రామాల్లో భూగర్భ జలాలు బాగా అడుగంటాయని, ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకు నీటి సంరక్షణ చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. డ్వామా అధికారులు నీటి సంరక్షణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి, జిల్లాలో నీటి సంరక్షణ కార్యక్రమాలను పటిష్టంగా అమలు జరిగేలా కృషి చేయాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చేపట్టే నీటి సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

అనంతరం...కొండపి నియోజక వర్గం, సింగరాయకొండ మండలం, కనుమళ్ళ గ్రామంలో నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఫారం పాండ్ (పంట కుంట)కు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ పై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం సింగరాయకొండలో రూ.2.30 లక్షలతో నిర్మించిన ఫారం పాండ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఫరూక్‌కు మంత్రి సంధ్యారాణి పరామర్శ



హైదరాబాద్ (చైతన్యరథం): సతీ వియోగంతో బాధపడుతున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం పరామర్శించారు. ఫరూక్ సతీమణి షహనాజ్ అకాల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి సంధ్యారాణి హైదరాబాద్‌లోని ఫరూక్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, ఫరూక్ మా అందరికీ ఒక సీనియర్ నాయకుడిగా మార్గదర్శకంగా నిలుస్తున్నారన్నారు. ఆయన అనుభవం, సహాయ సహకారాలు మాకు ఎంతో కీలకం. ప్రత్యేకంగా నూతన మంత్రులుగా మేము ప్రభుత్వంలో బాధ్యతలు స్వీకరించినప్పుడు, ఆయన మాకు మార్గనిర్దేశకుడిగా ఉండి ప్రోత్సహించారు. ఫరూక్ మార్గదర్శకత, నాయకత్వ లక్షణాలు మాకు పాఠంగా నిలుస్తాయి. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, వారు ఈ విషాదాన్ని అధిగమించాలని ఆకాంక్షిస్తున్నాను. షహనాజ్ ఆత్మకు శాంతి కలగాలని అల్లాను ప్రార్థిస్తున్నానన్నారు. ఫరూక్ వ్యక్తిత్వం, ఆయన అందించిన సేవలను గుర్తు చేస్తూ, ఈ విషాద సమయంలో పార్టీ, మంత్రివర్గం ఆయన వెంటే ఉంటుందని తెలిపారు.

## ప్రసూతి మరణాల్ని గణనీయంగా తగ్గించాం

- సురక్షిత ప్రసవాల కోసం మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు
- 2030 నాటికి ప్రసూతి మరణాల రేటును 70 కన్నా తగ్గించాలన్నదే లక్ష్యం
- ఎక్స్‌లో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




అమరావతి (చైతన్యరథం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు కార్యక్రమాల ద్వారా ఏపీలో ప్రసూతి మరణాలను తగ్గించటంలో గణనీయమైన ప్రగతి సాధించగలిగామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రసూతి మరణాలను తగ్గించడంతో పాటు మహిళలకు సురక్షితమైన మాతృత్వంతో పాటు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో పాటు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యల కారణంగా 2014-16 మధ్యకాలంలో లక్ష శిశు జననాలకు నమోదైన 130 ప్రసూతి మరణాల రేటు (ఎంఎంఆర్) 2018-20 నాటికి 97కి తగ్గిందన్నారు. 2030 నాటికి ప్రసూతి మరణాల రేటు లక్షకు 70 కన్నా తగ్గించాలన్న సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యసాధనకు కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా సంస్థాగత ప్రసవాలు 79 శాతం (2015-16లో) నుండి 89 శాతానికి (2019-21లో) పెరిగాయని, మొదటి త్రైమాసికంలో గర్భస్థ శిశు సంరక్షణా కేంద్రాల్ని (ఏఎన్‌సి) ఆశ్రయించే వారి శాతం 59 నుండి 70కి పెరిగిందని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, జననీ శిశు సురక్షా కార్యక్రమం, సురక్షిత మాతృత్వ ఆశ్వాసన్, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ వంటి పథకాలు సమగ్ర ప్రసూతి నిర్వహణ, మాతా శిశు సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. లక్ష్య లేబర్ రూమ్ మరియు ఆపరేషన్ థియేటర్ సంరక్షణ వంటి కార్యక్రమాలు ప్రసూతి సౌకర్యాల నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నాయన్నారు. అంతేకాక అధిక-ప్రమాదకర గర్భాలకు సురక్షిత ప్రసవాలను నిర్వహించడానికి ప్రసూతి విభాగాలను బలోపేతం చేశారన్నారు. మాతా, శిశు ప్రాణాలను కాపాడేందుకు మధ్యప్రదేశ్‌లో దస్తక్ అభియాన్, తమిళనాడులో అత్యవసర ప్రసూతి సంరక్షణ వంటి వినూత్న కార్యక్రమాలు అమలులో వున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక పాలనలో భారతదేశం 2030 నాటికి ప్రసూతి మరణాల రేటును 70 కన్నా తక్కువ స్థాయికి తేవాలన్న లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తోందని, సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

# దివ్యాంగులకు 40 స్కూటీలు అందించిన మంత్రి గొట్టిపాటి

- ఘనంగా మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి




అద్దంకి (చైతన్యరథం): విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పెదనాన్న, మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి వేడుకలు అద్దంకి నియోజకవర్గంలో శనివారం ఘనంగా జరిగాయి. తొలుత యద్దనపూడి గ్రామానికి చేరుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థానికంగా ఉన్న పెదనాన్న హనుమంతరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అద్దంకి చేరుకున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అద్దంకి పురపాలక సంఘం కార్యాలయంలో గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింథైట్, ఎస్ఆర్ఆర్, అసిస్ట్ ఇండియా సంస్థల సహాయ సహకారాలతో సేకరించిన సుమారు 40 త్రిచక్ర స్కూటీలను దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి అందించారు. అనంతరం లబ్ధిదారులైన 17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. దివ్యాంగులకు స్కూటీలు అందించడానికి ముందుకు వచ్చి, అద్దంకి నియోజకవర్గంలో ప్రజలకు సేవచేసే కార్యక్రమంలో భాగమైనందుకు దాతలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందించారు.

అద్దంకి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం శుభ పరిణామమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసించారు. గతంలో కూడా సీఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి గుర్తు చేశారు. నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోందని మంత్రి గొట్టిపాటి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 9 కమిటీ హాళ్లు నిర్మించినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాదికి మరో 10 కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. దాతల సహకారంతో అద్దంకి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి మహిళా విద్యార్థికి ఉచితంగా సైకిళ్లను అందజేస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అద్దంకి నియోజకవర్గంలో వ్యాపారులెవరూ వ్యాపారం చేసే పరిస్థితులు లేవని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యాపారులకు అండగా నిలుస్తోందని తెలిపారు. స్థానికంగా ఉండే యువతకు ఉపాధి కల్పించేందుకు ఎవరు ముందుకు వచ్చినా వారికి మద్దతు ఇచ్చి ప్రోత్సహిస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు.

కార్యక్రమం అనంతరం ప్రజావేదిక నిర్వహించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో కొంత మంది దీపం పథకం లబ్ధిదారులకు సబ్సిడీ అందడం లేదనే విషయాన్ని మంత్రి గొట్టిపాటి దృష్టికి అధికారులు తీసుకువచ్చారు. దీనిపై సచివాలయాల ఉద్యోగులతో చర్చించి ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు సబ్సిడీ అందేలా ఆదేశాలు జారీ చేశారు.

చైతన్యరథం

# పూర్తిస్థాయి డీజీపీ ఎంపికపై ప్రభుత్వం కసరత్తు

**ఐదు పేర్లతో కేంద్రానికి జాబితా - ఇన్‌ఛార్జి డీజీపీ హరీష్‌గుప్తాకే అవకాశం**

అమరావతి (చైతన్యరథం): కొత్త పోలీస్ బాస్ ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.. డీజీపీ ఎంపిక కోసం ఐదుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను కేంద్రానికి పంపించింది. సీనియర్ ఐపీఎస్ అధికారులు మాదిరెడ్డి ప్రతాప్, రాజేంద్ర నాథ్‌రెడ్డి, హరీష్ కుమార్ గుప్తా, కుమార్ విశ్వజిత్, సుబ్రహ్మణ్యం పేర్లతో కూడిన జాబితాను కేంద్రానికి పంపించింది. వీరిలో మూడు పేర్లు ఎంపిక చేసి తిరిగి జాబితాను ఏపీ ప్రభుత్వానికి కేంద్రం పంపనుంది. ప్రస్తుతం ఏపీ ఇన్‌ఛార్జి డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా కొనసాగుతోన్న విషయం విదితమే. ఆయన డీజీపీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌ఛార్జి నుంచి పూర్తిస్థాయి డీజీపీ నియామాకానికి మొగ్గు చూపిన రాష్ట్ర ప్రభుత్వం యూపీఎస్సీ ద్వారా డీజీపీని ఎంపిక చేసి రెండేళ్లపాటు కొనసాగించాలని భావిస్తోంది. అయితే,మెరిట్ ఆధారంగా హరీష్ కుమార్ గుప్తా పేరు ఉంటుందని, మరో రెండేళ్లపాటు ఆయనకు పోలీస్ బాస్‌గా పనిచేసే అవకాశం లభిస్తుందనే ప్రచారం సాగుతోంది.

## రుషికొండ బీచ్.. బ్లూఫ్లాగ్ హోదా పునరుద్ధరణ

విశాఖ (చైతన్యరథం): రుషికొండ బీచ్‌కు బ్లూఫాగ్ గుర్తింపును పునరుద్ధరించారు. ఈ మేరకు గుర్తింపు పత్రాన్ని బ్లూ ఫాగ్ సంస్థ ప్రతినిధులు విశాఖ జిల్లా కలెక్టర్‌కు శనివారం అందించారు. రాష్ట్రంలో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన ఏకైక బీచ్‌గా విశాఖలోని రుషికొండకు పేరుంది. అంతటి ప్రాధాన్యమున్న గుర్తింపు గతంలో తాత్కాలికంగా రద్దయింది. బీచ్ వద్ద 600 మీటర్ల తీర ప్రాంతాన్ని బ్లూఫ్లాగ్ బీచ్‌గా 2020లో ధ్రువీకరించారు. ఈ గుర్తింపును డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ (ఎస్ఈఈ) సంస్థ అందిస్తుంది. కొంతకాలంగా బీచ్‌లోకి శునకాలు రావడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం. వ్యర్థాలు పేరుకుపోవడం, నడక మార్గాలు దెబ్బతినడం వంటివి చోటుచేసుకున్నాయి. మూత్రశాలలు, దుస్తులు మార్చుకునే గదులు సరిగా లేవు. నిర్వహణ అధ్వాన్నంగా ఉన్న చిత్రాలతో కొందరు డెన్మార్క్ సంస్థకు ఫిర్యాదు చేయటంతో బ్లూ ఫాగ్ గుర్తింపు రద్దు చేశారు. బ్లూఫాగ్ గుర్తింపు రద్దు కావడంతో రుషికొండ బీచ్ పరిశుభ్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. బ్లూఫాగ్ హోదా కొనసాగేలా చర్యలు తీసుకుంది. బీచ్‌పై అభ్యంతరాలు వచ్చిన అంశాలపై దిద్దుబాటు చర్యలు చేపట్టింది. బీచ్ వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. బీచ్ పరిశుభ్రతపై పర్యటకులకు అవగాహన కల్పించే దిశగా చర్యలు. తీసుకోవాలని సూచించింది. బీచ్‌కు బ్లూఫాగ్ గుర్తింపు రద్దుకు బాధ్యులుగా పలువురు అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు సైతం వేసింది. పర్యటక శాఖ తీసుకున్న అనేక చర్యల కారణంగా రుషికొండ బీచ్‌కు తిరిగి బ్లూఫాగ్ గుర్తింపు మళ్లీ లభించింది.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

## - మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



ఒంగోలు (చైతన్యరథం): మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం నాడు ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని స్వయం సహాయక బృందాల సభ్యులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాల చెక్కులు మంత్రులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్వయం సహాయక బృందాల సభ్యులకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా త్వరలో స్వయం ఉపాధికి రుణాలు ఇవ్వబోతున్నాం. మహిళలకు 50 శాతం సబ్సిడీతో ఈ-ఆటోలు ఇస్తున్నాం, ఈ ఆటోలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. వీటితో పాటు ట్రాక్టర్లు కూడా ఇస్తాం. గ్రామాలలో పాడిపరిశ్రమను పెంచేందుకు సబ్సిడీతో పాడి ఆవులు, గేదెలు ఇస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు బట్టల సబ్బులు, స్నానపు సబ్బులు, షాంపులు, పౌడరు, దువ్వెనతో కూడిన కిట్లు ఇవ్వబోతున్నాం. హాస్టళ్లల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి టాయిలెట్‌లు శుభ్రంగా ఉంచని హాస్టల్ వార్డెన్లకు జరిమానాలు విధించాం. ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. కొండపి నియోజకవర్గంలోనే రూ. 25 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశాం. రోడ్లు లేని గ్రామాలలో రోడ్లు వేస్తున్నాం. ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లతో పాటు విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాతో పాటు, రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని, ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి డోలా కోరారు.

# ధాన్యం కొనుగోళ్లలో కొత్త చరిత్ర

- **రూ.8003 కోట్ల మేర ధాన్యం కొనుగోలు చేయడం రికార్డు**
- **వైసీపీ పాలన చీకటి రోజుల నుంచి అన్నదాతలకు విముక్తి**
- **ఖరీఫ్ స్ఫూర్తితో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సిద్ధం**
- **మీడియాతో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



తెనాలి (చైతన్యరథం): ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వం ఓ చారిత్రాత్మక మైలురాయికి చేరింది.. ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోలు చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ (శనివారం) ఉదయానికి రూ. 8,003 కోట్ల మేర ధాన్యం కొనుగోళ్లు చేసి చారిత్రాత్మక మైలురాయిని చేరిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ప్రతి జిల్లాలోనూ రైతులను ఏమాత్రం ఇబ్బందిపెట్టకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగించినట్లు పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో 34,78,445 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. తూకం తేడాలు, తేమ శాతం తేడాలు లేకుండా నిబద్ధతతో ధాన్యం కొనుగోలు చేయడం కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనం అన్నారు. శనివారం సాయంత్రం తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి నానా ఇబ్బందులు పడేవారన్నారు. దళారీల ప్రమేయంతో అహర్నిశలు శ్రమ చేసి పండించిన పంటను సరైన ధరకు అమ్ముకోలేక ఇక్కట్లకు గురయ్యేవారు. అప్పటి ప్రభుత్వమే ఏ మిల్లర్ కు అమ్మాలో కూడా నిర్ణయించేది. మిల్లుల దగ్గర రాత్రింబవళ్లు వేచి చూసి మరీ రైతులు ధాన్యం అమ్ముకోవలసిన పరిస్థితి ఉండేది. ఎంత చేసినా సరైన మద్దతు ధర రాక తేమ శాతం పేరు చెప్పి అన్నదాతను నిలువునా మోసం చేసేవారు. ఇన్ని ఇబ్బందులు పడి ధాన్యం అమ్మితే ఆ డబ్బులు ఎన్ని నెలలకు వస్తాయో.. అసలు వస్తాయో రావో కూడా తెలియని అయోమయ పరిస్థితి అన్నదాతల్లో ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదట అన్నదాతలకు సంబంధించిన సమస్యల మీద దృష్టి పెట్టాం. గత ప్రభుత్వంలో ధాన్యం సేకరించి, రైతులకు డబ్బులు ఇవ్వకుండా బాకీ పెట్టిన రూ. 1674 కోట్లను నెలలోనే విడుదల చేసాం. అన్నదాతలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి అది నిదర్శనం. దాని తర్వాత కూడా అన్నదాతల సమస్యల మీద, వారికి ఎలా మేలు చేయాలి అన్నదానిమీద కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి మనోహర్ తెలిపారు.

### 24 గంటల్లో డబ్బులు జమ

గత ప్రభుత్వంలో అన్నదాతలు ఎంతగా మోసపోయారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. దాన్ని అధిగమించి ఈ ఖరీఫ్ సీజన్లో రూ. 8,003 కోట్ల ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా, ధాన్యం డబ్బులను 24 గంటల్లో జమ చేయడం ఓ అరుదైన రికార్డు. ధాన్యం కొనుగోలుపై వైసీపీ వర్గాలు దుష్ప్రచారం చేసినా దాన్ని తిప్పి కొట్టగలిగాం. అన్నదాతలకు ఎక్కడా గోతాల సమస్య, రవాణా సమస్య, తేమ సమస్య లాంటివి లేకుండా పటిష్టంగా ధాన్యాన్ని కొనుగోలు చేయగలిగాం. ధాన్యం కొనుగోలు తీరు మీద వైసీపీ ఎన్ని పన్నాగాలు పన్నినా క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడ్డారు. ఎక్కడా చిన్న పొరపాటుకు తావు లేకుండా, పకడ్బందీగా ధాన్యం కొనుగోలు చేయడం కూటమి ప్రభుత్వ అతిపెద్ద విజయమని మంత్రి మనోహర్ చెప్పారు.

### రైతును నిలువునా మోసం చేసిన వైసీపీ

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విషయంలో వైసీపీకి కూటమి ప్రభుత్వానికి చాలా తేడా ఉంది. కూటమి ప్రభుత్వం రైతుకు అన్ని విధాల అండగా ఉండే ప్రభుత్వం. గుంటూరు జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 4,038 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తే, కూటమి ప్రభుత్వంలో 40,009 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ఇది 746 శాతం అధికం. బాపట్ల జిల్లాలో వైసీపీ హయాంలో 29,164 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేస్తే, కూటమి ప్రభుత్వ హయాంలో 91,758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ఇది 215 శాతం అధికం. పల్నాడు జిల్లాలో వైసీపీ హయాంలో కేవలం 67 మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 13,572 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. మొత్తం మీద వైసీపీ ప్రభుత్వ హయాం కంటే కూటమి ప్రభుత్వ హయాంలో 18 శాతం అధికంగా ధాన్యం కొనుగోలు చేయడం ఒక సువర్ణ అధ్యాయంగా చెప్పుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం రూ. 5,699 కోట్ల రూపాయల మేర ధాన్యం కొనుగోలు చేస్తే, కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు రూ. 8,003 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా 24 గంటల్లోనే రైతుల ఖాతాలో వాటిని జమ చేయడం ఓ అరుదైన విషయం. వ్యవసాయం మీద, రైతుల మీద కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సమయంలో 4.36 లక్షల మంది రైతులు పంటలు వేస్తే, కూటమి ప్రభుత్వ హయాంలో 5.49 లక్షల మంది రైతులు పంటలు వేసుకోవడం కూటమి ప్రభుత్వం మీద రైతులకు ఉన్న నమ్మకాన్ని తెలుపుతోందని మంత్రి మనోహర్ అన్నారు.

### నెల్లూరులో అవినీతి అనకొండలు

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్ళ విషయంలో నెల్లూరు జిల్లాలో భారీ అవినీతి జరిగింది. 2023-24 సంవత్సరాల్లో నెల్లూరు జిల్లాలో ఒక్క బస్తా ధాన్యం కూడా అప్పటి ప్రభుత్వం కొనలేదు. దీని వెనుక అతిపెద్ద స్కాం ఉంది. నెల్లూరు జిల్లాలో పౌరసరఫరాల శాఖలో పని చేసే కొందరు సిబ్బంది అత్యంత ఖరీదైన రోలెక్స్ వాచ్ లను, స్కోడా కార్లను కొనుగోలు చేసి విలాసాలు చేశారంటే అక్కడ రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో ఎంతటి అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చు. రైతులకు చెందాల్సిన డబ్బులు కొందరు దళారులు, అలాగే కొందరు ప్రభుత్వ సిబ్బంది తమ జేబులో వేసుకున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో అతి పెద్ద అవినీతి బాగోతం జరిగింది. కోవిడ్ తర్వాత నెల్లూరు జిల్లాలో ఒక్క ధాన్యం బస్తా కూడా కొనలేదు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశాం. నెల్లూరు జిల్లా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో 3 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి చురుగ్గా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం. మిల్లర్లు కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలి. రైతులు కూడా ఉత్సాహంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. దళారులకు దూరంగా మిల్లర్లు చొరవ తీసుకొని రైతులను ప్రోత్సహించాలని మంత్రి మనోహర్ సూచించారు.

### పాఠశాలలకు సన్న బియ్యం

ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు చేసిన స్ఫూర్తిని అందిపుచ్చుకొని రబీ సీజన్‌కు సిద్ధమవుతున్నాం. ఇదే ఉత్సాహంతో అన్నదాతకు మరింత మేలు జరిగేలా పనిచేస్తాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకంలో సన్న బియ్యం అందించాలని నిర్ణయం తీసుకున్నాం. ఇది విద్యార్థులకు ఎంతగానో మేలు చేస్తుంది. కూటమి ప్రభుత్వంలో ప్రతి ప్రజా ప్రతినిధి, మంత్రులు వ్యవస్థలో మార్పులు తీసుకురావడం కోసం నిబద్ధతతో పని చేస్తున్నారు. ధరల స్థిరీకరణ మీద, ధరలు తగ్గింపు మీద కూడా దృష్టిపెడతాం. తేమ శాతం, గోతాముల కొరత, రవాణా సమస్యలు లేకుండా చాలా సులభంగా రైతులు ధాన్యం అమ్ముకునే పద్ధతిని రాష్ట్రంలో తీసుకొస్తాం. కూటమి ప్రభుత్వం మొదటి నుంచి రైతు పక్షపాతి గానే పాలన సాగిస్తోంది.. దీన్ని భవిష్యత్తులోనూ కొనసాగిసామని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు.

చైతన్యరథం

# పశుమేత భూములు కబ్జా

- సబ్ కలెక్టర్ ఆదేశాలనూ పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- న్యాయం చేయాలని బాధితుల వినతి
- పలు సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన అర్జీదారులు
- అర్జీలు స్వీకరించిన నేతలు దేగల ప్రభాకర్, మాల సురేంద్ర





అమరావతి (చైతన్యరథం): పలు సమస్యలపై మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు పార్టీ నేతలకు వినతి పత్రాలు అందించి తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మాల సురేంద్ర.. బాధితుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం బుడ్డపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు విజ్ఞప్తి చేస్తూ.. తమ ఊరిలో పశువుల మేతకోసం వదిలిన భూములను కొందరు కబ్జా చేశారని తెలిపారు. దానిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే.. సబ్ కలెక్టర్ వచ్చి పరిశీలించి ఆక్రమణ నిజమేనని తేలారన్నారు. ఆక్రమణను తొలగించాలని అధికారులను ఆదేశించినా కింది స్థాయిలో రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి పశు మేత భూములను కబ్జా నుండి విడిపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నంద్యాల జిల్లా అవుకు మండలానికి చెందిన చిన్న ఈశ్వరయ్య మాదిగ విజ్ఞప్తి చేస్తూ.. తాను పర్మిట్ తీసుకున్న గనిని వైసీపీ నాయకులు కె. సూర్యనాగిరెడ్డి, శివనాగిరెడ్డి కబ్జా చేసి అనుభవిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులను ఆశ్రయించినా తనకు న్యాయం జరగలేదన్నారు. దయచేసి అధికారులు విచారణ జరిపించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం లింగంగుంట్ల అగ్రహారానికి చెందిన రాయ రామసుబ్బారెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. మాజీ సైనికోద్యోగినైన తనకు మాజీ సైనికులకు ఇచ్చే ప్రభుత్వ భూమిని ఇప్పిస్తానని చెప్పి మంచాల నరసింహారావు అనే వ్యక్తి దశల వారీగా తన వద్ద రూ. 15 లక్షలు తీసుకొని మోసం చేశాడని అతనిపై చర్యలు తీసుకొని తన డబ్బులు ఇప్పించాలని ఫిర్యాదు చేశారు.

కర్నూలు జిల్లా గొనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామానికి చెందిన దాసరి బజారి విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలోని మాల చిన్న రంగన్న, మాల పెద్ద రంగన్న, మునగాల శ్రీరాములు, కుంకునూరు జయరాములు అనే వ్యక్తులు తమ భూమిని అక్రమంగా ఆన్ లైన్ చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై గ్రామంలో పంచాయతీ పెడితే గ్రామస్థుల ముందు వారు తప్పు ఒప్పుకుని ఆన్‌లైన్‌లో పేర్లను తొలగింపునకు సహకరిస్తామని చెప్పి మళ్లీ నేడు అడ్డుతగులుతున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకొని తమ భూమి తమకు ఆన్‌లైన్ అయ్యేలా చూడాలని దాసరి బజారి విజ్ఞప్తి చేశారు.







# చర్మకారుల జీవితాల్లో వెలుగులకు చంద్రబాబు కృషి

- లెదర్ పార్కుల ఏర్పాటుకు గతంలోనే భూములు కేటాయింపు
- ఆ భూములపై గత ప్రభుత్వంలో వైసీపీ నేతల కన్ను
- రూ.కోట్ల విలువైన భూములు కొట్టేసేందుకు కుట్ర
- ఒక్క సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం
- చర్మకారుల కోసం ప్రత్యేక కో ఆపరేటీవ్ సొసైటీ ఏర్పాటు
- మీడియాతో లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

అమరావతి (చైతన్యరథం): చర్మకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు గతంలోనే అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు లెదర్ పార్కులకోసం భూములను కేటాయించారని, అయితే గత పాలకులు వాటిని అభివృద్ధి చేయకపోగా కోట్లు విలువ చేసే ఆ భూములను కొట్టేసేందుకు బినామీలతో కుట్ర పన్నారని లీడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాణిక్యరావు మాట్లాడుతూ చర్మకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేసిన మహనీయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఉమ్మడి జిల్లాల్లో చర్మకారుల వృద్ధికోసం లెదర్ పార్క్‌ల ఏర్పాటుకు ఆయన భూములు కేటాయించారు. చంద్రబాబు నాయుడు కేటాయించిన భూములను జగన్ రెడ్డి పాలనలో అభివృద్ధి చేయకపోగా దోచుకునేందుకు యత్నించారు. అడిగొప్పులలో 34.65 ఎకరాలను చంద్రబాబు నాయుడు 10 ఏళ్ల క్రితం కేటాయిస్తే.. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలు ఆ భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నారు. కోట్లరూపాయలు విలువ చేసే భూములను ఇళ్ల స్థలాల పేరుతో బినామీలకు కేటాయించారు. కాని ఒక్కరు కూడా అక్కడ ఇళ్లు నిర్మించుకోలేదు. ఆ భూమి మొత్తం అన్యాక్రాంతం చేసేందుకు కుట్ర చేశారు. చర్మ పరిశ్రమ అభివృద్ధి కోసం ఇచ్చిన భూమి ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కాకూడదని అధికారులకు స్పష్టంగా తెలియజేశాం. నిజమైన అర్హులు ఉంటే వారిని గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులకు తెలియజేశాం. విజయవాడలో రూ.100 కోట్ల విలువ చేసే భూమిని జగన్ రెడ్డి తాబేదారులు కొట్టేయాలని చూశారు. తప్పులు చేసే వ్యక్తులపై చర్యలు తీసుకునేందుకు మేము వెనుకాడం. చర్మకారుల అభివృద్ధికోసం నాడు చంద్రబాబు కేటాయిచిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత లిడ్ క్యాప్ చైర్మన్‌గా నా మీద ఉంది. లెదర్ ఉత్పత్తుల మీద ఆదారపడే వారి జీవణ ప్రమాణాలను మెరుగుపరిచేందుకు మేము కృషి చేస్తున్నామని మాణిక్యరావు తెలిపారు.



## చర్మకారులకు మెరుగైన శిక్షణ

ఏపీలో ఉన్న చర్మకారులందరి డేటా తీసుకుంటాం. వారికి మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు, అత్యాధునిక మిషనరీ ఇచ్చి వారి జీవితాలను మెరుగు పరచడానికి ప్రయత్నిస్తున్నాం. కామన్ ఫెసిలిటీ సెంటర్స్‌ను ఏర్పాటు చేసి చర్మకారుల నైపుణ్యాన్ని పెంచి వారు వ్యాపారాన్ని పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

ఇతర కో-ఆపరేటీవ్ సొసైటీల మాదిరిగా చర్మకారులకోసం ప్రత్యేక కో ఆపరేటీవ్ సొసైటీ ఏర్పాటు చేసి చర్మకారుల జీవన భద్రతకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఏపీలో చర్మ పారిశ్రామికాభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయి. చర్మ వృత్తిపై ఆధారపడిన యువతలో నైపుణ్యాన్ని పెంచేలా ముందుకు వెళు న్నాం. భారతదేశం నుండి లెదర్ ఎగుమతుల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది. కోఆపరేటీవ్ సొసైటీల ద్వారా లెదర్ రంగంపై ఆధారపడిన వ్యక్తులకు సరైన ధరలు అందేందుకు కృషి చేస్తున్నాం. చర్మశుద్ధి కర్మగారాలన్నీ చెన్నైలో ఉన్నాయి. ఏపీలో చర్మ శుద్ధి కర్మాగార ఏర్పాటు, టానరీల ఏర్పాటు ఆవశ్యకతను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటి ఏర్పాటుకు కృషి చేస్తాం. దీంతో చర్మరంగంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని మాణిక్యరావు వివరించారు.

# ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

## అందించడమే లక్ష్యం : అచ్చెన్నాయుడు



టెక్కలి (చైతన్యరథం): నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో శనివారం గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల పరిధిలో 497 గ్రామాలకు కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగానే రూ.97కోట్ల నిధులు లభ్యత ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.
వాటి పనులు నిమిత్తం గుత్తేదారులను టెండర్లకు పిలవాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
నియోజకవర్గంలో ప్రధాన రక్షిత మంచినీటి పథకం ద్వారా ఎన్ని వాటర్ సరఫరా చేసే ట్యాంకులు ఉన్నాయని వాటి పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని మంత్రి కోరగా 153 ట్యాంకులు ఉన్నాయని తెలిపారు. వారికి మరమ్మత్తులు చేయాల్సి ఉంటే తక్షణమే చేయాలని సూచించారు. ప్రస్తుతం బాగానే ఉన్నాయని అధికారులు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పేరు పనులు చేపట్టారని ప్రస్తుతం వాటి పరిస్థితిని మంత్రి వివరణ కోరగా బాగున్నాయని వివరించారు.
అదేవిధంగా గ్రామాల్లో అవసరమున్న చోట తాగునీరు బోర్లు వేయాలని సూచించారు. తాగునీరు సమస్యలు లేని గ్రామాలుగా ఉండాలనేదే తమ లక్ష్యమన్నారు. నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించాలని సూచించారు.
సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు బాషా, రామకృష్ణ, నాలుగు మండలాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్‌లో రహదారుల అలైన్మెంట్ మార్పు చేయాలి



విశాఖపట్నం (చైతన్యరథం): వి.ఎం.ఆర్.డి.ఎ రూపొందించిన మాస్టర్ ప్లాన్ 2041కి సంబంధించి వైజాగ్ పోర్ట్ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరెళ్ళ వలస గుండా వెళ్లే 70 మీటర్ల రహదారి అలైన్మెంట్ మార్పు చేయాలని ఆయా ప్రాంత ప్రజలు వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్‌ని శనివారం ఉదయం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మధ్య, ఎగువ మధ్యతరగతి వర్గాలకు చెందిన మేమంతా ఎంతో కష్టపడి నేరెళ్లవలస వద్ద వి.ఎం.ఆర్.డి.ఎ అభివృద్ధి చేసిన పలు లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేశామని, అలానే అదే రహదారిలో అనేక మంది పలు లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేశారని, ఐతే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో ఆయా రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా భోగాపురం విమానాశ్రయం వెళ్లేందుకు నేరెళ్ల వలస వద్ద వారి స్థలాల మీదుగా 70 మీటర్ల రహదారి నిర్మాణం ప్రతిపాదన చేశారని, ఇదే కొనసాగితే తమ స్థలాలు పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల 70 మీటర్ల రహదారి ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ త్వరలో మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు స్వీకరించి అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో మాస్టర్ ప్లాన్ సవరిస్తామని హామీ ఇచ్చారు.

## 24న విశాఖ వేదికగా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్

విశాఖ (చైతన్యరథం): నగరంలో ఈనెల 24న జరిగే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్లో ఢిల్లీ జట్టుతో తలపడేందుకు 'లఖ్ నవూ 'సూపర్ జెయింట్స్ జట్టు నగరానికి చేరుకుంది. జట్టు క్రీడాకారులకు క్రికెట్ అభిమానులు, క్రికెట్ సంఘాల ప్రతినిధులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారంతా ప్రత్యేక బస్సులో హొటల్కు చేరుకున్నారు. జట్టు కెప్టెన్ రిషబ్పంత్ తో పాటు మిగిలిన క్రికెటర్లు మయాంక్ యాదవ్, రవిబిష్ణోయ్, ఆకాశీప్, అవేశ్వాన్, మిల్లర్, మోషిన్ఖాన్, పూరన్, మార్క్రమ్, ఇతర ఆటగాళ్లు, కోచ్లు, యాజమాన్య ప్రతినిధులు వచ్చారు.

# వాహనం బోల్తా... గట్టు రట్టయిన గంజాయి తరలింపు



అరకు (చైతన్యరథం): అల్లూరి జిల్లా అరకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం, గంజాయి అక్రమ రవాణా గుట్టును రట్టు చేసింది. అరకు సమీపంలో ఓ ఇన్నోవా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురై బోల్తా పడింది. అందులో సుమారు 300 కిలోల మేర గంజాయి లభ్యమైంది. ప్రమాదం జరిగిన వెంటనే నిందితులు వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనం అద్దాలు పగలగొట్టి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అయితే మన్యం నుంచి దర్జాగా గంజాయి వాహనం తరలిపోతున్న ఎవరికీ పట్టుపడకపోవడం గమనార్హం. నిందితుల వాహనం ప్రమాదానికి గురికాకపోతే గంజాయి దొరికేదికాదని పలువురు పేర్కొంటున్నారు.

**ప్రతీ కళాశాలలో ఈగల్ బృందాలు :**

ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం రెండు కేసుల్లో కన్విక్షన్ పొందిన నేరస్తులకు కేసు తీవ్రత ఆధారంగా మరణశిక్ష సైతం పడే అవకాశం ఉందని ఈగల్ విభాగాధిపతి ఐజీ ఆకె రవికృష్ణ అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు ఈగల్ విభాగం కఠిన చర్యలు చేపడుతుందన్నారు. ప్రతీ కళాశాలలో ఈగల్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బృందంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉంటారని తెలిపారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఐజీ కోరారు. విద్యార్థులే ఈగల్ అంబాసిడర్లుగా ఉండాలన్నారు. సే నో టూ డ్రగ్స్ పేరుతో విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో గంజాయి వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు.



**ఎన్డీపీఎస్ కేసుల్లో ఇరుక్కుంటే అంతే :**

కొందరు విద్యార్థులు కిక్కు కోసం గంజాయిని సేవించి చివరకు మత్తుకు బానిసలుగా మారుతున్నారు. దీంతో ఆ విద్యార్థి కుటుంబం చిన్నాభిన్నమవుతోంది. దళారులు డబ్బు కోసం విద్యార్థులకు గంజాయి ఎర వేసి నేరగాళ్లుగా మారుస్తున్నారని తెలిపారు. ఒక్కసారి ఎన్డీపీఎస్ యాక్ట్ కేసుల్లో ఇరుక్కుంటే మీ పేరు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిదాన్ పోర్టల్ నమోదవుతుందని ఐజీ ఆకె రవికృష్ణ హెచ్చరించారు. దీంతో పాస్ పోర్ట్ రాదని విలువైన జీవితం అంధకారంలో పడుతుందన్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల ఎకరాల్లో గంజాయి సాగు ఉండేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి సాగు విస్తీర్ణం 100 ఎకరాల లోపే ఉందని తెలిపారు. డ్రోన్స్, శాటిలైట్ పరిజ్ఞానం వినియోగించి గంజాయి సాగును గుర్తిస్తున్నట్లు తెలిపారు.

# లక్కవరపుకోటలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట (చైతన్యరథం): లక్కవరపుకోట మండలం లక్కవరపుకోట గ్రామంలో గల ఉపాధిహామీ పనులను ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పరిశీలించారు. గ్రామాల అభివృద్ధి కొరకు ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తద్వారా గ్రామస్తుల ఆదాయాలు పెరగడం ద్వారా వలసలను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వంలో చర్చించే రాష్ట్రానికి అధిక నిధులను అందించే రోడ్లు భవనాలు మరియు ఇతర అభివృద్ధి కోసం ఇస్తున్నారని అన్నారు. ఈ పనులు పల్లె పండుగ పేరుతో గ్రామాలలో జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు పుట్టా శ్రీను, యూనిట్ ఇన్‌ఛార్జ్ సంఘం సతీష్, మాజీ ఎంపీటీసీ రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# పదోతరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్...

## 11 మంది ఉపాధ్యాయులపై సస్పెన్షన్



శ్రీకాకుళం (చైతన్యరథం): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే వారిని గాడి తప్పేలా చేస్తే ఆ విద్యార్థి జీవితం ఆగమ్యగోచరంగా తయారవుతుంది. ఈ ఉదంతం ఎక్కడో సినిమాల్లో జరిగిందనుకుంటే మీరు పొరబడినట్లే. పదో తరగతి పరీక్షల్లో చూచిరాతకు సహకరించిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో జిల్లా విద్యాశాఖను అప్రమత్తం చేసి దాడులు చేయడంతో అసలు బండారం బయటపడింది. ఎచ్చెర్ల మండలం, కుప్పిలి ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులోని మొదటి కేంద్రంలో 207 మంది, రెండవ కేంద్రంలో 218 మంది విద్యార్థులకు కేటాయించారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఆదేశాల మేరకు నాలుగు స్క్వాడ్ బృందాలు శుక్రవారం ఆయా కేంద్రాలపై ఏకకాలంలో దాడులు చేశాయి. విద్యార్థులు ఆంగ్ల పరీక్షను చూసి రాస్తున్నట్లు గుర్తించారు. ఇందుకు సహకరించిన సిట్టింగ్ స్క్వాడ్ ఎంవీ కామేశ్వరరావు, డిపార్టుమెంట్ అధికారులు బీవీ సాయిరాం, పి.హరికృష్ణ, ఇన్విజిలేటర్లు ఎం.కనకరాజు, ఎస్.కృష్ణ, పి.నాగేశ్వరరావు, కె.కామేశ్వరరావు, ఎ.శ్రీరాములునాయుడు, ఎస్.శ్రీనివాసరావు, బి.రామ్మోహన్‌రావు, పి.ఫల్గుణరావులను, బోధనేతర సిబ్బంది ఒకరిని డీఈవో సస్పెండ్ చేశారు. ఏ కేంద్రంలో ముగ్గురు, బీ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు. కుప్పిలిలోని జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులే స్లిప్పులు తయారు చేసి ఆదర్శ పాఠశాల కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులకు అందజేస్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ స్క్వాడ్ ఉన్నప్పటికీ పక్కా ప్రణాళికతో విచ్చలవిడిగా చూచిరాతకు సహకరిస్తుండటాన్ని గమనించిన తనిఖీ బృందాలు నిర్ఘాంతపోయాయి. అందుకుగాను కుప్పిలి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.పద్మకుమారి, చీఫ్ సూపరింటెండెంట్లు పీవీ దుర్గారావు ఎం.లక్ష్మణరావులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ డీఈవో ఆర్‌జేడీకి నివేదికను పంపారు.

## పారిశ్రామికాభివృద్ధి ద్వారానే యువతకు ఉపాధి కల్పన

- వచ్చే మార్చి నాటికి ఏడు వేల ఉద్యోగాలు కల్పించడమే నా ధ్యేయం
- జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించడానికి దిశా దోహదం
- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి




ఏలూరు (చైతన్యరథం): పార్లమెంట్ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి సాధించడం ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యంగా నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, దెందులూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తో కలిసి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. సమావేశం అనంతరం ఎంపీ మహేష్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి జిల్లాలోని ఏడు వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మెగా జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో దిశా సమీక్ష సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించారని, సమగ్ర చర్చ జరగకపోవడం వల్ల జిల్లాలో అభివృద్ధి కుంటుపడిందని ఎంపీ మహేష్ కుమార్ ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత షెడ్యూల్ ప్రకారం దిశా సమీక్ష సమావేశం నిర్వహిస్తూ, జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధిపై సమగ్రంగా చర్చిస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. శాశ్వత అభివృద్ధికి బాటలు వేసేందుకు దిశా సమావేశాలు దోహదం చేస్తాయని ఎంపీ మహేష్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానికంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు దోహదం చేసే సిఎస్ఆర్ నిధులు సాధ్యమైనంత ఎక్కువ రాబట్టేందుకు దృష్టి సారించాలని అధికారులకు సూచించినట్లు ఎంపీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలో మౌలిక వసతుల కల్పనకు సిఎస్ఆర్ నిధులు వినియోగించుకునే అవకాశం ఉందని ఎంపీ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అద్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధిపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రహదారుల అభివృద్ధితో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని ఎంపీ వెల్లడించారు. మిగిలిన రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాబడతామని ఎంపీ హామీ ఇచ్చారు. కొల్లేరు ప్రాంత వాసులకు అత్యున్నత న్యాయస్థానంలో ఊరట లభించిందని, రానున్న రోజుల్లో కొల్లేరు సమస్యకు సంబంధించి చిక్కుముడులు విడదీసి పరిష్కరించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎంపీ భరోసా ఇచ్చారు. అధికారులు, ఎమ్మెల్యేల సహకారంతో జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

## దొంగచాటుగా సంతకాలు... లక్షల్లో జీతాలు... మండిపడ్డ నిమ్మల

పాలకొల్లు (చైతన్యరథం): జగన్ మానసిక స్థితి చూస్తుంటే ముఖ్యమంత్రి కుర్చీ ఇస్తే కానీ అసెంబ్లీకి వచ్చేలా కనిపించడం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో పర్యటించిన ఆయన నియోజకవర్గంలోని జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. టిడ్కో గృహ సముదాయాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి వాటి పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయిన టిడ్కో గృహాలను బ్యాంకులో తాకట్టు పెట్టి వేల కోట్లు పక్కదారి పట్టించిన పేదల ద్రోహి జగన్ అని మంత్రి నిమ్మల మండిపడ్డారు.

దొంగచాటుగా సంతకాలు–లక్షల్లో జీతాలు:

వచ్చే జూన్ నెలాఖరు నాటికి ఎన్టీఆర్ టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామన్న నిమ్మల రాజధాని, పోలవరం ప్రాజెక్టుల పునర్ నిర్మాణంతో పాటు అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి ఇసుక, లిక్కర్, గనులు, విలువైన భూములను దోచుకొని రూ. కోట్లలో అక్రమార్జనకు పాల్పడ్డారన్న ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు కాకుండా దొంగ చాటుగా సంతకాలు పెట్టి లక్షల్లో జీతభత్యాలు కాజేస్తున్నారని ఆరోపించారు.




## సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే నాలుగు రైళ్లు రద్దు



సామర్లకోట: సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే నాలుగు రైళ్లను ఈనెల 24న రద్దు చేసినట్లు విజయవాడ డివిజన్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని స్టేషన్ మేనేజర్ ఎం. రమేష్ తెలిపారు. సామర్లకోట నుంచి పిఠాపురం వరకు రెండు రైళ్లను మాత్రమే పంపించేవారమని, ఇకపై ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్ విధానం ద్వారా అయిదు రైళ్లను నడిపించే అవకాశం ఉందన్నారు. పనుల్లో భాగంగా ఈనెల 24న ఒక్కరోజు సింహాద్రి, ఉదయ్ ఎక్స్ప్రెస్లు, కాకినాడ–విశాఖపట్నం, విశాఖ–రాజమహేంద్రవరం పాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు వివరించారు. కాకినాడ–లింగంపల్లి మధ్య రెండు ప్రత్యేక రైళ్లు కాకినాడ–లింగపల్లి మధ్య ఏప్రిల్ 2 నుంచి జులై 1 వరకు రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతారు. కాకినాడ–లింగంపల్లి వరకు రైళ్లు సోమ, బుధ, శుక్రవారాల్లో నడుస్తాయి. లింగంపల్లి నుంచి కాకినాడ వచ్చే రైళ్లు ఏప్రిల్ 3 నుంచి జులై 1 వరకు మంగళ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

## తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు : ముప్పిడి




తాళ్లపూడి (చైతన్యరథం): వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రానీయకుండా మోటారు బోర్లు, పైపులైన్లు తదితర వాటికి ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ పోశిరాజు అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో గజ్జరంలో ఇచ్చిన లేవుట్లో ఎక్కడా సరైన రహదారులు లేకుండా ఇళ్ల పట్టాలు ఇచ్చారని, తద్వారా వారంతా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడా ఫాగింగ్ చేయడం లేదని, ఆ యంత్రాలు మరమ్మతుల బారిన పడ్డాయన్నారు. రావూరుపాడు గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా వీధిదీపాలు లేవని, రాత్రిళ్లు రాకపోకలు సాగించేవారు పలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం అందించడంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ముమ్మిడివరం (చైతన్యరథం): చిన్న పిల్లలు, తల్లులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ డి.శాంతకుమారి సూచించారు. పోషణ బి పడాయీ బి కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీడీపీవో ఐ.విమల అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ శిబిరంలో పీడీ శాంతకుమారి పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలకు విధిగా తల్లిపాలు అందించాలని, తల్లి పాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించాలని సూచించారు. తల్లులు, పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా పీడీ సత్యకుమారి, సీడీపీవో విమలలు తల్లిపాల ప్రాముఖ్యత, ఐదేళ్లలోపు పిల్లల పెరుగుదల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీలకు సలహాలు, సూచలనలిచ్చారు. ఈవోఎస్‌లు జీవీఎస్ఎన్ దేవి, సీహెచ్ పల్లవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర లక్ష్యాన్ని నెరవేర్చాలి

ముమ్మిడివరం (చైతన్యరథం): సాలిడ్‌వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్లను సక్రమంగా నిర్వహిస్తూ స్వచ్ఛంధ్రా లక్ష్యాన్ని నెరవేర్చాలని ముమ్మిడివరం, ఉప్పలగుప్తం ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, జి.రాజ్‌కుమార్ సూచించారు. అనాతవరం పంచాయతీ పరిధిలోని సాలిడ్‌వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్ షెడ్డు వద్ద శుక్రవారం ఘన వ్యర్థాలపై ముమ్మిడివరం, ఉప్పలగుప్తం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు, పారిశుధ్య సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రతీ ఒక్కరు స్వచ్ఛంధ్రాలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్సీ పాము వెంకటేశ్వరరావు, అనాతవరం సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫారం పాండ్స్ ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి

బలిజిపేట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొదట ప్రాధాన్యతగా 390 ఫారం పాండ్స్ మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే 190 పూర్తయ్యాయని ఏపీవో కేశవరావు తెలిపారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా తుమరాడలో శనివారం జడ్పీటీసీ రవికుమార్ చేతుల మీదుగా ఈ ఫారం పాండ్కు శంకుస్థాపన నిర్వహించారు. వీటి వల్ల భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడదని, ఈ చోట భూగర్భ జలాలు పెరుగుతాయని సూచించారు. కార్యక్రమంలో ఇన్చార్జి, ఎంపీడీఓ ఏవీఎస్ నగేష్, సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

భీమవరం (చైతన్యరథం): రబీలో రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ కమిటీ సభ్యులతో కొనుగోళ్లపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ... ధాన్యం కొనుగోళ్లపై గ్రామస్థాయిలో రైతులందరికి పూర్తి అవగాహన కల్పించామని తెలిపారు. కనీస మద్దతు ధర కొనుగోళ్లపై గ్రామస్థాయిలో రైతులందరికీ పూర్తి అవగాహన కల్పించాం. కనీస మద్దతు సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్ – ఏ రకం రూ.2,320 మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ముఖ్యంగా తేమ శాతం 17 కన్నా తక్కువ ఉండేటట్లు బాగా ఆరబెట్టి శుద్ధి చేసుకుని రైతు సేవా కేంద్రానికి తీసుకువచ్చే విధంగా శాఖల అధికారులు రైతులందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

# గత ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ సాయం నిలిపేసి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడింది : ప్రత్తిపాటి పుల్లారావు




చిలకలూరిపేట (చైతన్యరథం): అనారోగ్య సమస్యలతో బాధపడే నిరుపేదలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందేందు కు సీఎం.ఆర్.ఎఫ్ సాయం (ముఖ్యమంత్రి సహాయనిధి) ఎంతగానో ఉపయోగపడుతోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో పలువురు లబ్దిదారులకు సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 44 మందికి రూ.16,84,907ల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులను ప్రత్తిపాటి స్వయంగా లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు, ప్రముఖ ఆసుపత్రుల్లో వైద్యచికిత్సలు పొంది, ఆ బిల్లులను ప్రభుత్వానికి పంపితే, వారు పెట్టిన మొత్తం ఖర్చుల సొమ్మును ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. పేద కుటుంబాలకు మేలు చేసే ఈ పథకాన్ని, సీఎం.ఆర్.ఎఫ్ సాయం పంపిణీని గత ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందదని మాజీమంత్రి తెలిపారు. ప్రజావైద్యవ్యవస్థను నీరుగార్చి, ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుందన్నారు. తాము సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడు, కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోని పార్టీలు, నాయకులు ఉన్నా లేకపోయినా ఒకటేనని గ్రహించే, ప్రజలు వైసీపీకి బుద్ధిచెప్పి సాగనంపారని పుల్లారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సాదాశివరావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, మండలాల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు మరియు గ్రామ, పట్టణ వార్డు పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి కుంటల తవ్వకాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్



నందిగామ (చైతన్యరథం): స్థానిక మండలం మనగచర్ల గ్రామంలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటి కుంటల తవ్వకం పనులకు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. రైతులంతా పొలాల్లో నీటి కుంటలు తవ్వించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కుంటుపడిన నగరాభివృద్ధి



గుంటూరు (చైతన్యరథం) : గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే నగరాభివృద్ధి కుంటుపడిందని, కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర మేయర్‌గా పనిచేసిన వైసీపీ నాయకుడు కావటి మనోహర్‌నాయుడు ప్రాతినిధ్యం వహించిన 20వ డివిజన్‌లో అనేక సమస్యలు తిష్టవేశాయన్నారు. శనివారం 20వ డివిజన్ నల్లచెరువులో రూ.2.14కోట్ల పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఇన్‌ఛార్జ్ మేయర్ షేక్ సజీలాలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టబోయే నల్లచెరువు 18,19, 21వ లైన్లలో స్వయంగా పర్యటించి ప్రజలతో ముచ్చటించారు. డ్రైనేజీలు నిర్మించే సమయంలో మంచి నీటి పైపు లైన్లు అస్తవ్యస్తంగా లేకుండా చూడాలని అధికారులను, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... 20వ డివిజన్ నల్లచెరువు 18,19,21 లైన్లలో రూ.2.14 కోట్లతో రోడ్లు మరియు డ్రైన్స్ పనులకు శంకుస్థాపన చేయటం జరిగిందని, ఈ డివిజన్‌లో అనేక ఏళ్లుగా సరైన రోడ్లు, డ్రైన్లు లేకపోవడం బాధాకరమన్నారు. చిన్నపాటి వర్షానికే కాలువలు పొంగి, మునిపోతున్నా కూడా మేయర్‌గా పనిచేసిన మనోహర్‌నాయుడు కనీసం పట్టించుకోలేదని, కాబట్టే మొన్నటి ఎన్నికల్లో ప్రజలు వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించారని అన్నారు. ఈ డివిజన్‌లో పీకలవాగు అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని, కాలువపై ఉండే ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం టిడ్కో గృహాలు కేటాయిస్తుందన్నారు. పశ్చిమ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తయారు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని మాధవి తెలిపారు.

# నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడో జోన్‌కు పూర్తిస్థాయిలో నీరందించాలి : ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు



ఎన్టీఆర్ జిల్లా (చైతన్యరథం): నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడో జోన్‌కు పూర్తిస్థాయిలో నీరందించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు కోరారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం చింతలనర్వ గ్రామంలో మధిర బ్రాంచ్ కాలువ 14వ కిలోమీటర్ దగ్గర విడుదలవుతున్న సాగర్ జలాలను పరిశీలించారు. రెగ్యులేటర్ నుండి దిగువకు నిదానపురం మేజర్‌కు 380 క్యూసెక్కులు మధిర మేజర్‌కు 70 క్యూసెక్కుల నీటి విడుదలను గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యాలయం నుండి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3.62 లక్షల ఎకరాలకు ఆయకట్టుకు 32 టీ.ఎం.సీ.ల వాటా ఉందని కానీ నేటి వరకు పైన ఉన్న తెలంగాణ ప్రభుత్వం 19 టీ.ఎం.సీ.లు మాత్రమే విడుదల చేసిందని, రెండో జోన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందినప్పటికీ ఎడమ కాలువ మూడోవ జోన్‌కు అరకొరగా నేటికీ 300 క్యూసెక్‌లు ఇస్తున్నందున ఆయకట్టు చివరి ప్రాంతంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందన్నారు. దీనిని పరిష్కారం కొరకు పైన ఉన్న తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో సాగర్ నీటి విడుదలను పెంచాలని విజ్ఞప్తి చేశారు.

# తెనాలిలో 24 నుంచి రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



తెనాలి (చైతన్యరథం) : ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేది నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు నిర్వహించే ఎడ్ల బల ప్రదర్శనలో రైతులంతా ఉత్సాహంగా పాల్గొనాలని వేమూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. శనివారం తెనాలి మార్కెట్ యార్డులో ఎడ్ల బల ప్రదర్శన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న ఈ ఎడ్ల బల ప్రదర్శనలో సుమారు 100 జతల ఎడ్ల ప్రదర్శన జరుగుతుందని, గెలుపొందిన వారికి బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, సాంకేతిక పనిముట్లు, హార్టికల్చర్ షాప్‌లు, మెడిసిన్ మొక్కలు, పశు ప్రదర్శన ఎగ్జిబిషన్‌లో ఉంచబోతున్నామని ఇవి రైతులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, కకమిటీలుగా ఏర్పడి పనులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సైతం పాల్గొనడం జరుగుతుందని రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నక్కా ఆనందబాబు కోరారు.

# ప్రవాసాంధ్రులు ప్రగతికి వారదులుగా నిలవాలి

●మంచి చేయాలనుకునే వారికి ప్రోత్సాహం అందించే ప్రభుత్వం రాష్ట్రంలో ఉంది: ఎమ్మెల్యే రాము



గుడివాడ (చైతన్యరథం): గ్రామాల ప్రగతిలో ప్రవాసాంధ్రులు వారదులుగా నిలుస్తూ.. ప్రజలకు మంచి చేయడంలో భాగస్వామ్యలు కావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు మండలం మామిడి కోళ్ల గ్రామంలో గోల్డ్ అవార్డు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూ.11.45 లక్షల నిధులతో ఏర్పాటుచేసిన సురక్షిత త్రాగునీటి ప్లాంటును ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ప్రత్యేకతలను గోల్డ్ అవార్డు ప్రాజెక్ట్ నిర్వాహకులు శ్రీవెన్ని జెట్టి ఎమ్మెల్యేకు వివరించారు. ప్లాట్ వద్ద ఏర్పాటుచేసిన బాక్సులో ఐదు రూపాయల కాయిన్ వేస్తే 20 లీటర్ల సురక్షిత త్రాగునీరు వస్తుందని జెట్టి చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ.. మంచి ఆలోచనతో కేవలం ఐదు రూపాయలకే 20 లీటర్ల సురక్షిత త్రాగునీరు అందించేలా గ్రామంలో ప్లాంట్ ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. మనం ప్రపంచంలో ఎక్కడ ఉన్న.. ఏ స్థాయికి చేరుకున్న... జన్మనిచ్చిన గ్రామాన్ని మర్చిపోకూడదని... గ్రామాల అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు భాగస్వామ్యులు కావాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. మామిడికొళ్ల గ్రామానికి చెందిన గోల్డెన్ అవార్డు ప్రాజెక్ట్ సంస్థ నిర్వాహకులు ప్రజలకు మరిన్ని మంచి పనులు చేయాలని సూచించారు. రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడానికే సీఎం చంద్రబాబు పి4 ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రజలకు మంచి చేయాలనుకునే వారిని ప్రోత్సహించే ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని రాష్ట్ర ప్రగతిలో ఎన్‌ఆర్‌ఐలు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. అనంతరం ప్రాజెక్టు నిర్వాహకురాలు శ్రీవెన్ని జెట్టిను ఎమ్మెల్యే రాము సత్కరించారు.

# స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ తీసుకువచ్చేందుకు కృషి ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

విజయవాడ (చైతన్యరథం): పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో వుండే విధంగా ఫీజులతో ఉత్తమ విద్యార్ధులను తయారు చేస్తున్న కెబిఎన్ కాలేజీకి కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వచ్చేందుకు కృషి చేస్తున్నానని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. శనివారం కెబిఎన్ కాలేజీలో జరిగిన స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్‌కి ఎంపికేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జె.ఈ.ఈ. లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన యశ్వంత్ సాయిను ఎంపి కేశినేని శివనాథ్ సన్మానించారు. అలాగే చైనాలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి మూడు పతకాలు సాధించిన భరత్ కూమర్ , హ్యాండ్ బాల్ క్రీడాకారిణి బి.సత్యలను కూడా సన్మానించారు.

# జిల్లా అభివృద్ధిలో గొట్టిపాటి పాత్ర కీలకం

## మంత్రి రవికుమార్, డాక్టర్ లక్ష్మీ

యద్దనపూడి, (చైతన్యరథం): మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామంలో శనివారం స్వర్గీయ మాజీ మంత్రివర్యులు గొట్టిపాటి హనుమంతరావు 28వ వర్ధంతి కార్యక్రమంలోవిద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు సేవలను గుర్తు చేసుకున్నారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధిలో ఆనాడు గొట్టిపాటి హనుమంతరావు చెరగని ముద్రవేశారన్నారు. నదులలో వృధాగా పోతున్న నీటిని సాగుకు అనుకూలంగా అనేక



ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఇప్పటికీ రైతుల హృదయాలలో హనుమంతరావు చిరస్మరణీయంగా నిలిచారని వారు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా గ్రామాల మధ్య అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులు, పాఠశాల భవనాలు మండల వ్యవస్థలో కార్యాలయాల నిర్మాణం చేపట్టి ప్రజా హృదయాలను గెలుచుకున్నారన్నారు. కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా రైతుల కోసం రైతుల అభ్యున్నతి కోసం అనేక పథకాలను రూపకల్పన చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మంత్రివర్గంలో పౌరసరఫరాల శాఖ మాత్యులుగా పని చేశారు. ప్రకాశం జిల్లాలో గొట్టిపాటి హనుమంతరావు ప్రజల హృదయాలలో ఇప్పటికీ నిలిచిపోయారన్నారు. ఆయన స్ఫూర్తిని అందుకొని సమగ్ర ప్రకాశ అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి ప్రజలు అవసరాలు తీర్చేందుకు ఆయన కుటుంబ వారసులుగా పనిచేస్తామని గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీలు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు కుటుంబ సభ్యులు గొట్టిపాటి రాముడు, గొట్టిపాటి భరత్, గొట్టిపాటి బాబు, గొట్టిపాటి హర్ష తదితరులు ఉన్నారు. కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీ అభిమానులు హనుమంతరావు అభిమానులు పెద్ద ఎత్తున నివాళులర్పించి ఆయన స్మృతులను గుర్తు చేసుకున్నారు.

# ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

## గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

గిద్దలూరు, (చైతన్యరథం): ప్రతీ నీటి బొట్టు చాలా విలువైనదని, నీటి బొట్టును వృధా చేయడం మన భవిష్యత్తును కోల్పోవడమేనని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. "ప్రపంచ జల దినోత్సవం" సందర్భంగా గిద్దలూరు మండలం, తిమ్మాపురం గ్రామంలో పలు ఇంకుడు గుంతలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ నీరు లేదంటే సమస్త జీవరాశుల మనుగడ లేదని, ప్రతి నీటి బొట్టును దాచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలు నీటిని ఆదా చేసే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని, నీటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పసుపుల మల్లీశ్వరయ్య, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్ యాదవ్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, ఎండీవో రమణారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తెలుగుదేశం సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## రైతులకు పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమీరెడ్డి పిలుపు



నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరు జిల్లాలోని అల్లూరు మండలం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమీరెడ్డి పట్టాభిరామిరెడ్డి సందర్శించారు. సందర్భంగా డైరెక్టర్ పట్టాభి మాట్లాడుతూ రైతుల సౌకర్యం కోసం ప్రతి రైస్ మిల్లు కట్టిన బ్యాంకు గ్యారంటీకి ఒకటిన్నర రెట్లు అధికంగా ధాన్యం తీసుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ గ్రేడ్ ఏ రకం పుట్టి 19720/- నిర్ణయించారని వెల్లడించారు. కొనుగోలు చేసిన 24 గంటల్లోపే అకౌంట్లోకి డబ్బు జమవుతుందని తెలిపారు. రైతులు రైతు సేవ కేంద్రానికి వెళ్ళవలసిన అవసరం లేకుండానే ప్రభుత్వ వాట్సాప్ నంబర్ 7337359375 కి మీ వాట్సాప్ నెంబర్ నుండి హాయ్ అని మెసేజ్ పెడితే మీ ధాన్యానికి షెడ్యూలింగ్ మెసేజ్ వస్తుందన్నారు. తద్వారా ధాన్యం అమ్మకానికి సిద్ధమైనట్లు పిపిసికి అందుతుందని తెలియజేశారు.



# సేద్యపు గుంటలతో పంటల పరిరక్షణ

## ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, (చైతన్యరథం): సేద్యపు గుంటల పథకం అమలులో భాగంగా కమ్మవారిపాలెం గ్రామంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీతో కలసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటలు పంట పొలాలలో పురుగు మందుల పిచికారీకి, వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలో తేమను పెంచడానికి భూగర్భ జలాలను పెంచడానికి ఉపయోగపడతాయన్నారు. రైతులు నీటి ఎద్దడి సమయంలో పంటను రక్షించు కోడానికి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. రైతులు అందరూ ఈ అవకాశాన్ని ఊయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

## కార్యకర్తలకు ఎమ్మెల్యే కందుల పిలుపు

మార్కాపురం, (చైతన్యరథం): మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మార్కాపురం మండల కార్యకర్తల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తగా తన శక్తి మీద పనిచేయాలని నాయకులు దానికి తోడ్పాటు అందించాలని కార్యకర్తలను కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోట విజయం సాధించాలని దానికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కోరారు. ప్రతి గ్రామములో 60 ఓట్లకు ఒక కుటుంబ సాధికారిక సభ్యున్ని ఎన్నుకుని వచ్చే నాలుగు రోజుల్లో ఏర్పాటు చేసుకోవాలని ఇది ప్రతి ఒక్కరి కర్తవ్యమని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే వారిని సభ్యులుగా నియమించాలి అని కోరారు. అనంతరం స్కాన్ చేసి నియోజకవర్గ వ్యాప్తంగా సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పంచాలని పిలుపునిచ్చారు.



# ఆగిన పనులన్నీ పూర్తి చేస్తాం

## నెల్లూరులో మంత్రి నారాయణ సుడిగాలి పర్యటన

## పార్కులు, అభివృద్ధి పనుల తనిఖీ

నెల్లూరు, (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేసి ఖజానా ఖాళీ చేసి వెళ్ళిందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు. ప్రజా వేదిక కూల్చివేతతో రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగించారన్నారు. 10 లక్షల కోట్లు అప్పులను రాష్ట్రానికి మిగిల్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో కుంటుపడిన పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షతతో గాడిలో పెడుతున్నారన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం తేవాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల నుంచే మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నగరంలోని 9,8,7,6 డివిజన్లో పర్యటించి అధికారులను పరుగులు పెట్టించారు. పాఠశాలలు, క్రీడా మైదానాలలో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ముందుగా 9,8,7,6 డివిజన్ పరిధిలోని అంబేద్కర్ పార్కు, ఎఫ్‌సీఐ కాలనీ పార్కు, చిన్న బాలయ్య నగర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల, బీవీఎస్ స్కూలు, ఆర్ఎస ఆర్ ఉన్నత పాఠశాల, నవ పేట బీవీఎన్ గర్ల్స్ హై స్కూల్, పప్పుల వీధి వైవీఎంసీ హై స్కూల్ తదితర ప్రాంతాల్లోనీ పాఠశాలలో క్రీడా మైదానాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 2014-19 కాలంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు నగరంలోని అన్ని ప్రాంతాల్లో పార్కులను ఏర్పాటు చేశామన్నారు. గతంలో నెల్లూరులో గాంధీ బొమ్మ వద్ద స్వతంత్ర పార్క్ మాత్రమే ఉండేదన్నారు. తర్వాతి కాలంలో చిల్డ్రన్స్ పార్క్ వచ్చిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తాను మంత్రిగా అనేక పార్కులను ఏర్పాటు చేశానన్నారు. ప్రతి లేఔట్ లో ఒక పార్కు ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం ఈ ఐదేళ్లలో వాటన్నిటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం వాటిని పునరుద్ధరిస్తున్నామని పార్కుల్లో పిల్లల కోసం ఆట పరికరాలు పెద్ద వాళ్ల కోసం వ్యాయామ పరికరాలను



ఏర్పాటు చేస్తున్నామన్నారు. అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు చొరవతో రూ.1100 కోట్ల హడ్కో నిధులను తీసుకొచ్చి నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తోపాటు మంచినీరు ఏర్పాట్లను ప్రారంభించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి 90% పనులు పూర్తయ్యాయని, ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని అన్నారు. గడిచిన ఐదేళ్లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంచినీటి వసతిని గురించి గాని వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఆగిపోయిన పనులను తిరిగి పున ప్రారంభిస్తున్నామని అందుకు అవసరమైన రూ.165 కోట్ల హడ్కో నిధులను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తీసుకు వచ్చామన్నారు. నెల్లూరు నగరంలో ఆగిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాగునీరు ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. 2019లో ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకొని ఏసీ బస్సు షెల్టర్‌లను ఏర్పాటు జరిగిందని మా మీద కక్షతో అప్పటి వైసీపీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందని అన్నారు. గ్రీన్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో పార్కులతో పాటు రోడ్డు డివైడర్ల మధ్యలో గ్రీనరీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ అసిస్టెంట్ కమిషనర్ నందన్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, మామిడాల మధు, కువ్వారపు బాలాజీ, గురుబ్రహ్మం గుప్తా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# డెడ్ స్టోరేజీకి చేరువగా శ్రీశైలం జలశయం



కర్నూలు (చైతన్యరథం): శ్రీశైలం జలాశయంలో ఒకవైపు నీటిమట్టం వేగంగా పడిపోతుంది. ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి తెలంగాణ జెన్కో విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తుండగా.. కుడి విద్యుత్ కేంద్రంలో ఏపీ జెన్కో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసింది. రోజుకు ఒక టీఎంసీకి పైగానే విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తుండడంతో సమీప కాలంలోనే శ్రీశైలం డ్యామ్ లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరుకోనుంది.. అంటే ఇప్పుడు శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువగా అయిపోయింది.. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 837.5 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 58.1456 టీఎంసీలు ఉంది. అయితే, తెలంగాణ జెన్కో ఎడమ గట్టు విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా రోజుకు ఒక టీఎంసీ నుంచి 2 టీఎంసీల వరకు నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో నీటిమట్టం వేగంగా పడిపోతోంది. శనివారం కూడా ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 19,493 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. శుక్రవారం సాయంత్రానికి 61.9240 టీఎంసీల నీరు డ్యామ్‌లో ఉండగా శనివారం మధ్యాహ్నానికి 58.1456 టీఎంసీలకు తగ్గిపోయాయి. తెలంగాణ జెన్కో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. శ్రీశైలం జలాశయానికి ఈ వాటర్ ఇయర్‌లో మొత్తం 1600.50 టీఎంసీల నీరు కృష్ణ, తుంగభద్ర నదుల నుంచి చేరింది. క్రస్టు గేట్ల ద్వారా 687.05 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసారు ఏపీ జెన్కో కుడిగట్టు విద్యుత్ కేంద్రంలో 199.39 టీఎంసీల నీటిని వినియోగించి 1155.99 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. తెలంగాణ జెన్కో ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 398.41 టీఎంసీలు వినియోగించి 2058.86 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 41.78 టీఎంసీలు, మాల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా 29.55 టీఎంసీలు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 211.48, టీఎంసీలు విడుదల చేసారు. ముచ్చుమర్రి లిఫ్ట్ ద్వారా 2.54 టీఎంసీలు విడుదల చేసారు. ప్రస్తుతం ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా కుడిగట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేశారు.

# పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ నన్ను ర్యాంగింగ్ చేశారు : శబరి



ఓర్వకల్లు (చైతన్యరథం): తాను కూడా పవన్ కల్యాణ్ అభిమానేనని, మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదివే రోజుల్లో తనను పవన్ ఫ్యాన్స్ ర్యాగింగ్ చేశారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి గుర్తు చేసుకున్నారు. ఫాం పాండ్‌ల నిర్మాణాలకు భూమి పూజ కోసం పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆమె పవన్ కల్యాణ్ ముందు బైరెడ్డి శబరి మాట్లాడారు. తాను మాట్లాడితే అభిమానులు ఎవరూ వినరని ఆమె తెలిపారు. జన సైనికులు నిజంగా చాలా గట్టివారని, వారు తెగించి పని చేసి కూటమికి అఖండ విజయాన్ని అందించారని పవన్ సమాధానం ఇచ్చారు. కాగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచర్ల గ్రామంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించారు. ఫాం పాండ్‌ల నిర్మాణాలకు పవన్ కల్యాణ్ భూమి పూజ చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. జనసైనికులు, వీరమహిళలు గట్టిగా నిలబడ్డారని అన్నారు. మమ్మల్ని కూడా నిలబెట్టారని పేర్కొన్నారు. సామాన్యమైన విజయం అందించలేదని, దేశం మొత్తం ఏపీ వైపు చూస్తోందని, కష్ట సమయంలో జనసైనికులు కూటమిని గెలిపించారని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. 175 సీట్లకు గానూ 164 సీట్లు, 21 ఎంపీ సీట్లు ఇచ్చారన్నారు. మీలాంటి అభిమానులు లేకపోతే ఇలాంటి విజయం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. నీటిని సంరక్షించుకోవడం చాలా ముఖ్యం నీటిని నిల్వచేసుకోగలిగితే ఎలాంటి సమస్య ఉండదు. వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు చేశాం. 1.55 లక్షల పంట కుంటలు నిండితే మనకు ఇబ్బంది ఉండదు. వీటి చుట్టూ అరటి, నిమ్మ, దానిమ్మ వంటి మొక్కలు పెంచితే రైతులకు దీర్ఘకాలిక ఆదాయం ఉంటుంది. బాతులు, చేపల పెంపకానికి కూడా దోహదం చేస్తుంది. తద్వారా రైతులకు నీటి సమస్య తీరుతుంది, పంట దిగుబడి పెరుగుతుంది. రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యం. నీటి నిల్వ అనేది భవిష్యత్?కు బంగారు బాట' అని పవన్ తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదని పవన్ విమర్శించారు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించామని చెప్పారు. ప్రజలకు ఉపాధి ఆర్థిక స్థిరత్వం కల్పించాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. వంద మందికిపైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించినట్లు వివరించారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించామని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# ఉక్కపోత వేళ ఉపశమనమిచ్చేలా వర్షాలు



వేసవి వేడి, ఉక్కపోత, భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు అక్కడక్కడా కురుస్తున్న వర్షాలు, చల్ల గాలులు కాస్త ఉపశమనమిచ్చాయి. గత కొద్ది రోజులుగా తీవ్ర ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న శ్రీ సత్య సాయి జిల్లా కదిరి ప్రాంతంలో వడగళ్లతో కూడిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. తనకల్లు మండల కేంద్రంలో ఓ మోస్తరు వర్షానికి వడగండ్లు కురిశాయి. వాటిని చూసేందుకు యువకులు అక్కడికి చేరారు. రోడ్డు పక్కన కుప్పలుగా ఉన్న వడగండ్లను చూసిన స్థానికులు వాటిని ఒక చోటికి గొప్పగా పోసి మురిసిపోయారు. మరోవైపు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా చల్లని గాలులతో పాటు.. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కాస్తా పెద్దదిగా మారడంతో... పట్టణంలోని ప్రధాన వీధుల్లోనూ, రహదారులపై భారీగా నీరు చేరి... ప్రజలు అవస్థలు పడ్డారు. శ్రీకన్య కూడలి, శారదానగర్ వంటి ప్రాంతాల్లో... మురుగునీరు పొంగి ప్రవహించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల, పాడేరు మండలాల్లో వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద పరిమాణంలో ఉన్న వడగళ్లు పడ్డాయి. గాలులతో కూడిన వర్షాల కారణంగా... మాడుగులలో ఓ శుభకార్యంలో టెంట్లు నేలకొరిగాయి. టెంట్ల కింద ఉన్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. వాహనాల పైభాగాన పడిన వడగళ్లు పెద్ద శబ్దాలతో భయం కలిగించాయి. పార్వతీపురంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ తీవ్ర ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు.. ఒక్కసారిగా వచ్చిన మబ్బులు కాస్త ఊరటనిచ్చాయి. తర్వాత కాసేపటికే ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు 40 నిమిషాలపాటు భారీ వర్షం కురవడంతో.. వాతావరణం కాస్త చల్లబడింది. రోడ్లపై ఉన్న చిన్న వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

# దళితులకు, ఇల్లు, స్మశానవాటిక లేని గ్రామం ఉండకూడదు

- పార్టీలకతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి
- పొజిషన్ సర్టిఫికెట్లకు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు



మడకశిర (చైతన్యరథం): అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకు అతీతంగా ఇల్లు మంజూరు చేయాలని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్. రాజు రెవిన్యూ అధికారులకు సూచించారు. మడకశిర పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు 5 మండలాల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ..ఇల్లులేని దళితుడు ఉండకూడదు, శ్మశానం లేని గ్రామం ఉండకూడదని, అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా బీసీలు కూడా అత్యధికంగా పేదవారు ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాల్సిందే అని తేల్చిచెప్పారు. ముఖ్యంగా గ్రామాల్లో పేదలకు పొజిషన్ సర్టిఫికెట్ జారీ విషయంలో వీఆర్ఓలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని... ఇళ్ల మంజూరు విషయంలో ఎవరైనా పేదల దగ్గర డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవిన్యూ అధికారులు, సిబ్బందిని ఎమ్మెల్యే హెచ్చరించారు. పట్టాలు లేని ప్రతి పేదవాడికి పట్టాలు ఇచ్చి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా ఇళ్ల పట్టాలు ఇచ్చి పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి సహకరించాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు కోరారు. ఈ కార్యక్రమంలో 5 ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజుతో పాటు, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, 5 మండలాల రెవిన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి ఆనంను కలిసిన పరిటాల శ్రీరామ్



ధర్మవరం (చైతన్యరథం:): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రాం నారాయణరెడ్డిని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అమరావతిలోని మంత్రి చాంబర్‌లో గత శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శివరాత్రి ఉత్సవాలను కాటకోటేశ్వరస్వామి క్షేత్రంలో ఎలాంటి గొడవలూ లేకుండా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రిని సన్మానించారు. ఆయన వెంట కాటకోటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు బొట్టుకిష్ట, టీడీపీ నాయకులు జింకల రాజన్న, సాయినాథ్ ఉన్నారు. అనంతరం అర్చకుడు, టీడీపీ నాయకులు మంత్రి సత్యకుమార్‌నూ సన్మానించారు.

# నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం



రాయచోటి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలుస్తోందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తోందన్నారు. అన్నమయ్య జిల్లాలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాకు హాజరైన వారికి భోజన వసతి కల్పించారు.



# భారత్, అమెరికా రక్షణరంగ సహకారానికి ఢోకా లేదు

*టారిఫ్ ఆందోళనల వేళ.. భారత్-అమెరికా మధ్య రక్షణ రంగ సహకారానికి సంబంధించి కీలక పురోగతి కనిపించింది. తేజస్ యుద్ధ విమానాల తయారీలో ముఖ్యమైన ఎఫ్-404 ఇంజిన్లు అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ నుంచి డెలివరీ కానున్నాయి. రెండేళ్ల ఆలస్యం తర్వాత అవి ఈ నెల భారత్‌కు రానున్నాయి. ఈ ఏడాది మొత్తం 12 ఇంజిన్లు అందనున్నాయి. తేజస్ మార్క్ 1-ఏ యుద్ధ విమానాల్లో ఎఫ్-404 ఇంజిన్లు అత్యంత కీలకం. అయితే డెలివరీ జాప్యంతో హాల్ (హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్)లో తేజస్ యుద్ధ విమానాల తయారీ ప్రక్రియ నెమ్మదించింది. పాకిస్థాన్, చైనా నుంచి పొంచి ఉన్న ముప్పు, అలాగే డ్రాగన్ అత్యాధునిక ఫైటర్ జెట్లను రూపొందించి పాక్‌కు అందిస్తుంటే. మనం ఇంజిన్ల కోసం వేచిచూడాల్సి రావడం ఆందోళనకు దారితీసింది. 2021లో కుదిరిన 761 మిలియన్ల డాలర్ల కాంట్రాక్ట్ ప్రకారం.. ఏటా 20 ఇంజిన్లు అందుతాయని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. 98 కేఎన్ థ్రస్ట్ (కిలోన్యూటన్ల శక్తి) కలిగిన ఎఫ్-414 ఇంజిన్‌ను కూడా అమెరికా నుంచి సమకూర్చుకోవాలని భారత్ తలపెట్టింది. మార్క్ 2లో వాటిని అమర్చాలని యోచిస్తున్నారు. అయితే వీటి సరఫరా కూడా ఇంకా మొదలు కాలేదు. ప్రస్తుతం ప్రపంచంలో సొంతంగా ఫైటర్ ఇంజిన్‌ను తయారుచేసే సత్తా అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాలకే ఉంది. ఆ సామర్థ్యాన్ని సాధించేందుకు భారత్ 1984లోనే కావేరి ఇంజిన్ ప్రాజెక్టు చేపట్టింది. అణ్వస్త్ర పరీక్షల వల్ల అంతర్జాతీయ ఆంక్షలకు గురవడంతో ఈ ప్రాజెక్టు దెబ్బతింది. అయితే, 2016లో ఫ్రెంచి కంపెనీ శాఫ్రాన్ సహకారంతో 110 కేఎన్ శక్తి గల ఇంజిన్ తయారీని తలపెట్టింది.*

# ఇష్టపడితే సమయం పరిమితి ఉండదు

**- 90 గంటలు పని చేసేవారున్నారు**

**- రాజ్యసభ ఎంపీ సుధామూర్తి**



ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఇటీవల పని గంటలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ఆయన సతీమణి, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి స్పందించారు. ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే సమయం ఎప్పుడూ పరిమితంగా మారదని ఆమె వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. 'ప్రజలు ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే దానికి సమయం ఎప్పుడు పరిమితిగా మారదు. నా భర్త డబ్బులు లేని సమయంలో కూడా ఇన్ఫోసిస్‌ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభావం కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు అంతకంటే ఎక్కువ సమయం పని చేయడం వల్లే అది సాధ్యమైంది. నా భర్త మాత్రమే కాదు.. జర్నలిస్టులు, డాక్టర్లు వంటి ఇతర రంగాల్లోని వారు కూడా 90 గంటలు పని చేస్తున్నారు. భగవంతుడు అందరికీ రోజుకి 24 గంటల సమయమే ఇచ్చాడు. దానిని మీరు ఎలా వినియోగించుకుంటారు అనేది మీ ఇష్టం' అని సుధామూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె వ్యక్తిగత జీవితం గురించి కూడా మాట్లాడారు. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను చూసుకున్నప్పుడు తాను ఇంటి బాధ్యతలు తీసుకున్నానని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంటిని చూసుకోవడం, పిల్లలను పెంచడంతో పాటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను తన భర్త కంటే ఓవరైమ్ పని చేస్తున్నానని, దానికి ఆయన వెనక నుంచి సపోర్ట్‌గా ఉండి ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మహిళ విజయం వెనక అర్థం చేసుకునే వ్యక్తి ఉంటారని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా వృత్తి జీవితంలో భార్యాభర్తలు ఒకరికొకరు సాయం చేసుకోవాలని అదే జీవితమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే భారత్లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కొందరు దీన్ని సమర్థించగా మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలంటూ ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ నెట్టింట చర్చకు దారితీశాయి.



# హిందీ రచయిత వినోద్‌కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ పురస్కారం

ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయిత శుక్లానే కావడం విశేషం. భారతీయ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందజేస్తారు. 1944లో ఏర్పాటైన ఈ పురస్కారాన్ని దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవంగా పరిగణిస్తారు. శుక్లా ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయిత.

ఈ పురస్కారం కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. హిందీ సాహిత్యం, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన అద్భుతమైన కృషికిగానూ ఈ అవార్డు వరించింది. 1999లో ఆయన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఇక గత ఏడాది ఉర్దూ కవి, సినీ గేయరచయిత గుల్జార్, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ఈ పురస్కారాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.

# వేళాపాళా లేని విమానాలు

**- ఎయిర్ ఇండియా తీరుపై ఎన్సీపీ ఎంపీ అసహనం**

**- చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి విన్నపం**



ఎయిర్ ఇండియా విమానంపై ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అసహనం వ్యక్తంచేశారు. తాను ప్రయాణించాల్సిన విమానం కోసం గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విమానయాన సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖను కోరారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'ఎయిర్ ఇండియా విమానాలు నిరంతరం ఆలస్యం అవుతున్నాయి. మేము ప్రీమియం ఛార్జీలు చెల్లిస్తాం. అయినప్పటికీ విమానాలు సమయానికి చేరుకోవు. దీని కారణంగా పిల్లలు, వృద్ధులతో సహా అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. నేను ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన విమానంలో ప్రయాణించానని, దీనికోసం గంట 19 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చిందని వెల్లడించారు. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి ఆలస్యాలు ఆమోదయోగ్యం కావు. విమానయాన సంస్థలకు కఠినమైన నిబంధనలు విధించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ఈ సందర్భంగా కోరుతున్నా. ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా ఆయా సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి' అని ఆమె రాసుకొచ్చారు. ఇక, ఈ పోస్టుపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. తమ చేతుల్లో లేని పలు సమస్యల వల్ల విమానాలు ఆలస్యం అవుతున్నాయని తెలిపింది. మీరు ప్రయాణించే విమానానికి అలాంటి సమస్యే ఎదురైనట్లు వెల్లడించింది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని ఎక్స్ వేదికగా పేర్కొంది.

# ప్రజాభిప్రాయం మేరకు వికసిత్ ఢిల్లీ బడ్జెట్

**ముఖ్యమంత్రి రేఖా గుప్తా వెల్లడి**



త్వరలో ప్రవేశపెట్టనున్న వికసిత్ దిల్లీ బడ్జెట్ విషయంలో ప్రజల నుంచి 10 వేల సూచనలు అందినట్లు ముఖ్యమంత్రి రేఖాగుప్తా వెల్లడించారు. ఇందులో మహిళల ఆర్థిక సాధికారత, విద్య, ఆరోగ్యం, యమునా నది ప్రక్షాళన, కాలుష్యం వంటి వాటికి బడ్జెట్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం 'ఖీర్' వేడుకతో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దేశ రాజధానిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 24 నుంచి 28 వరకు జరగనున్నాయి. మార్చి 25న బడ్జె ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను సిద్ధం చేసే ముందు ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తమ ప్రభుత్వం నిపుణులతో సహా సమాజంలోని వివిధ వర్గాలను సంప్రదించిందని రేఖా గుప్తా తెలిపారు. ప్రజల నుంచి మెయిల్ ద్వారా 3,303 సూచనలు రాగా వాట్సప్ ద్వారా 6,982 సూచనలు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని పరిగణలోకి తీసుకొని బడ్జెట్‌ను రూపొందిస్తామని అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను, ఉపాధి కల్పనను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం ఢిల్లీని అభివృద్ధి బాటలో నడుపుతుందని పేర్కొన్నారు.

# నాగ్‌పూర్ అల్లర్ల వెనుక బంగ్లా హస్తం?

***విచారణకు ఆదేశించిన ఫడ్నవీస్ ప్రభుత్వం***



మహారాష్ట్రలో నాగ్‌పూర్ మార్చి 17న రెండు వర్గాల మధ్య చెలరేగిన హింసతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఈ అల్లర్లలో బంగ్లాదేశీయుల హస్తం ఉందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. ప్రస్తుతం దీనిపై ఏమీ చెప్పలేమని.. దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దీని వెనుక ఉన్నది ఎవరైనా కఠిన చర్యలు తప్పవని అన్నారు. నాగ్పుర్లో నెలకొన్న హింసకు సంబంధించిన కారణాలపై మహారాష్ట్ర భాజపా అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. హింసకు కారణమైన వారినుంచే ఆస్తి నష్టం మొత్తాన్ని వసూలు చేస్తామని ఫడణవీస్ పేర్కొన్నారు. వారు డబ్బు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయిస్తామని అన్నారు. "మతపరమైన వస్తువులు దహనం చేసినట్లు కొంతమంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు పుకార్లు వ్యాప్తి చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి కారణమైన 104 మందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వదంతులు వ్యాప్తి చేసి.. అల్లర్లకు కారణమైన వారిని కూడా నిందితులుగా పరిగణిస్తాం. ఇప్పటి వరకు 66 పోస్టులను తొలగించాము" అని ఫడణవీస్ అన్నారు. మార్చి 17న నాలో కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. అనంతరం కొందరు ఉద్రిక్తతలను మరింత రెచ్చగొట్టేలా నినాదాలు చేయడంతో హింసాత్మకంగా మారింది. ఘర్షణలో 34 మంది పోలీసులు గాయపడ్డారని, ఇందులో ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ అల్లర్ల వెనుక బంగ్లాదేశీయుల హస్తం ఉండి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.




# ట్రంప్ గోల్డ్ కార్డ్‌కు భారీ డిమాండ్

## - ఒక్కరోజే 1000 కార్డుల అమ్మకం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్డ్ కార్డ్'లు భారీగా అమ్ముడుపోతున్నాయి. ఒక్కరోజే 1000 కార్డులను విక్రయించినట్లు అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5 బిలియన్ డాలర్లు సేకరించామని చెప్పారు. ఓ పాడ్‌కాస్ట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 3.7 కోట్ల మందికి ఈ కార్డు కొనే సామర్థ్యం ఉంది. కనీసం 10 లక్షల మంది దీనిని కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారని లుట్నిక్ పేర్కొన్నారు. అసలు ఈ కార్డు ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఎవరిదన్న ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ మదిలో నుంచి వచ్చిన ఆలోచనే అని చెప్పారు. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే తన బాధ్యత అని, దీన్ని అమలు చేసే ప్రణాళిక తన వద్ద ఉందన్నారు.

ఈబీ-5 స్థానంలో..

ప్రస్తుతం ఉన్న పెట్టుబడి వీసా ఈబీ-5 స్థానంలో గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. 5 మిలియన్ డాలర్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టామని, వారు అమెరికాకు వచ్చి భారీగా ఖర్చుపెడితే స్థానికంగా ఉద్యోగాలు కూడా పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు.

ఇదే విషయంపై ఇటీవల మరో సందర్భంలో లుట్నిక్ మాట్లాడుతూ.. 2.5లక్షల మంది ఈ గోల్డ్ కార్డు కొనేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు. ఈబీ-5 ప్రోగ్రామ్ వల్ల జరుగుతున్న మోసాలు, ఇతర అక్రమాలను అరికట్టేందుకు వీటిని తీసుకొస్తున్నాం. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

ఈబీ-5 వీసా విధానాన్ని అమెరికా 1990లో తీసుకొచ్చింది. వేలాది మంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే, ఈ విధానంతో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఇటీవల జరిపిన అధ్యయనంలో తేలింది. దీంతో 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజాగా దీని స్థానంలో గోల్డ్ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

# ఇజ్రాయెల్‌పై హూతీల క్షిపణి దాడి

ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. గాజాపై ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. గాజాలో ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా హూతీ తీవ్రవాదులు యెమెన్ నుంచి ఇజ్రాయెల్‌పైకి క్షిపణిని ప్రయోగించారు. ఇజ్రాయెల్ విమానాశ్రయం లక్ష్యంగా ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ దాడులకు బాధ్యత వహిస్తూ.. హూతీ తిరుగుబాటుదారుల సైనిక ప్రతినిధి యాహ్యా సోరీ ఒక ప్రకటన విడుదల చేశారు. గాజాపై ఇజ్రాయెల్ దురాక్రమణ ముగిసేవరకు తమ దాడులు కొనసాగిస్తామన్నారు. 48 గంటల్లో మూడోసారి దాడులు చేశామన్నారు. అంతేకాకుండా ఎర్ర సముద్రంలోని అమెరికా వాహక నౌక 'యూఎస్ఎస్ హ్యారీ ఎస్. ట్రూమాన్ పై హౌతీలు దాడులు ప్రారంభించారని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ సమీపంలోని బెన్ గురియన్ విమానాశ్రయం నుంచి ప్రయాణాలు శ్రేయస్కరం కాదని ప్రయాణికులను హెచ్చరించారు. కాగా బెన్ గురియన్ విమానాశ్రయానికి సంబంధించిన వెబ్‌సైట్‌సాధారణంగానే పని చేస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.



ఇజ్రాయెల్ నౌకలపై దాడుల్ని పునరుద్ధరిస్తామని ప్రకటించిన యెమెన్ తిరుగుబాటు దళం హూతీలపై అమెరికా ఇటీవల పెద్దఎత్తున దాడి చేసింది. 'ఉగ్రవాద స్థావరాలు, ఉగ్ర నేతలపై మన ధీరులైన యోధులు గగనతల దాడులు చేస్తున్నారు. మన నౌకా స్థావరాలు, వాయు స్థావరాలు, నౌకాదళాలను పరిరక్షించుకునేందుకు పాటుపడుతున్నారు. స్వేచ్ఛాయుత నౌకాయాన వాణిజ్యాన్ని పునరుద్ధరించడానికి పాటుపడుతున్నారు' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ప్రపంచంలో ఎక్కడైనా జలమార్గాల్లో అమెరికా వాణిజ్య నౌకాదళ నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణాన్ని ఏ ఉగ్రశక్తీ అపజాలదని స్పష్టంచేశారు. హూతీలకు మద్దతు ఇవ్వడాన్ని నిలిపివేయాలని ఇప్పటికే ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీనిపై ఇరాన్ సుప్రీం ఖమేనీ స్పందిస్తూ.. హూతీల దాడుల్లో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. వారు సొంత కారణాల వల్ల దాడులకు పాల్పడుతున్నారని.. ఈ విషయంలో అగ్రరాజ్యం తమపై ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. మరోవైపు అమెరికా చేస్తున్న దాడులను హూతీ పొలిటికల్ బ్యూరో యుద్ధ నేరాలుగా అభివర్ణించింది. యెమెన్ దళాలు ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది.

# వెంటాడిన 30 ఏళ్ల నాటి తప్పు

## - ఐస్‌లాండ్ మహిళా మంత్రి రాజీనామా



30 ఏళ్ల కిందట చేసిన తప్పుకు ఐస్‌లాండ్ మహిళా మంత్రి ఇప్పుడు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఐస్‌లాండ్ మహిళా మంత్రి ఆస్టిల్డర్ లోవా థోర్స్‌దోట్టిర్ దాదాపు 30 ఏళ్ల క్రితం చేసిన తప్పు.. ఆమె పదవి పోయేలా చేసింది. గతంలో ఒక బాలుడితో ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుని, ఆ తర్వాత ఓ బిడ్డకు కూడా జన్మనివ్వడమే ఇందుకు కారణం. ఈ విషయంపై దేశవ్యాప్తంగా తీవ్ర వివాదం చెలరేగడంతో ఆస్టిల్డర్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

ఆస్టిల్డర్ లోవా థోర్స్‌దోట్టిర్ (58) ఐస్లాండ్ విద్యా, శిశు సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే.. మూడు దశాబ్దాల క్రితం ఆమె ఒక మతపరమైన వర్గానికి కౌన్సిలర్‌గా వ్యవహరించారు. అదే సమయంలో అందులోని అస్మండ్సన్ అనే 16 ఏళ్ల బాలుడుతో ఆమె వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. అది కొంతకాలం కొనసాగించడంతో వారికి ఓ బిడ్డ కూడా జన్మించాడు. ఇటీవల స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన తప్పులను అంగీకరించారు.

కొంతకాలం తర్వాత తన బిడ్డతో ఎలాంటి సంబంధం కొనసాగించకుండా ఆస్టిల్డర్ తనని అడ్డుకున్నారని అస్మండ్సన్ ఆరోపించినట్లు ఓ మీడియా పత్రిక కథనం ప్రచురించింది. "బిడ్డ పుట్టిన సమయంలో నేను అక్కడే ఉన్నాను. ఒక ఏడాది వరకు వారితో కలిసే ఉన్నా. కానీ, ఆ తర్వాత నా కుమారుడిని ఆమె కలవనివ్వలేదు. అతడి కోసం న్యాయపోరాటం చేశా. 18 ఏళ్ల పాటు నా కుమారుడి సంరక్షణ కోసం డబ్బు చెల్లించాను. అయినప్పటికీ నా బిడ్డను కలిసేందుకు నేను చేసిన ప్రయత్నాలు అన్నీ విఫలమయ్యాయి. ఆస్టిల్డర్ మమ్మల్ని కలవనివ్వలేదు" అని అస్మండ్సన్‌ను ఉటంకిస్తూ కథనం పేర్కొంది. ఐస్‌లాండ్ చట్టాల ప్రకారం.. ఒక మైనర్‌తో గురువు లేదా వారి సంరక్షకులు వివాహేతర సంబంధం పెట్టుకోవడం నేరం. అలా చేసినవారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై ఇటీవల అస్మండ్సన్ బంధువు ఒకరు దేశ ప్రధానమంత్రికి విషయం తెలియజేయడంతో వెలుగులోకి వచ్చింది. మైనర్‌తో మంత్రి, వివాహేతర సంబంధం జరపడం ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీసింది. దీంతో ఆమె తాజా ఇంటర్వ్యూలో తప్పును అంగీకరించారు. అదేవిధంగా ఆమెపై విమర్శలు వెల్లువెత్తడంతో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

# ట్రంప్ కోసం పుతిన్ ప్రార్థనలు



వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది నిజం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ క్షేమం కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్ చర్చిలో ప్రార్థనలు చేశారట. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అనుకూలంగా ఆయన ప్రకటనలు, నిర్ణయాలు ఉంటున్నాయి. ఈ తరుణంలో వారి స్నేహం గురించి ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది.

గత ఏడాది అమెరికా ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. పెన్సిల్వేనియాలో ప్రచారంలో ఉండగా 20 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో.. ట్రంప్ చెవికి స్వల్పంగా గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి వేదికపైనుంచి దించి ఆస్పత్రికి తరలించారు. ఆ ఘటన అప్పట్లో సంచలనమైంది. ఆ విషయం తెలుసుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్.. ట్రంప్ క్షేమం కోసం ప్రార్థనలు చేశారని రష్యాలో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ ఇటీవల తెలిపారు. స్థానిక చర్చికి వెళ్లిన పుతిన్.. మత గురువును కలిసి, ట్రంప్ కోసం ప్రార్థించారు. అధ్యక్షుడితో పుతిన్‌కు స్నేహం ఉంది. స్నేహితుడి కోసం ఆయన ప్రార్థించారు. ఇదే విషయాన్ని నేను ట్రంప్‌నకు కూడా చెప్పాను. పుతిన్ చర్య ఆయన హృదయాన్ని కదిలించిందని స్టీవ్ విట్కాఫ్ ఓ పాడ్‌కాస్ట్‌లో భాగంగా వెల్లడించారు.

గత ఏడాది ట్రంప్‌పై వరుసగా జరిగిన హత్యాయత్న ఘటనలపై గతంలో పుతిన్ స్పందించారు కూడా. అప్పట్లో పుతిన్ మాట్లాడుతూ.. అమెరికా చరిత్రలోనే ఈసారి దురదృష్టకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల్లో ట్రంప్‌పై పోరాడేందుకు కొందరు అనాగరిక పద్ధతులు పాటిస్తున్నారు. ఆయన కుటుంబాన్ని, పిల్లలను లక్ష్యంగా చేసుకొని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు గుప్పించడం దిగ్భ్రాంతి కలిగించింది. పలుమార్లు ఆయనపై హత్యాయత్నాలు జరగడం విచారకరం. నా అంచనా ప్రకారం.. ఇప్పుడు ట్రంప్ ఏమాత్రం సురక్షితంగా లేరు. అయితే ఆయన తెలివైన వ్యక్తి ముప్పును అర్థం చేసుకొని జాగ్రత్తగా ఉంటారని విశ్వసిస్తున్నా అన్నారు.

# తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కన్నెర్ర

## - 5 లక్షల మందిని తిప్పిపంపనున్న అమెరికా

అమెరికాలో వివిధ దేశాలకు చెందిన ఐదు లక్షల మందికి పైగా తాత్కాలిక వలసదారులను వెనక్కి పంపనున్నారు. అగ్రరాజ్య అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి వలసల విషయంలో అమెరికా సర్కారు దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి వారిని దేశం నుంచి పంపిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా తాత్కాలిక వలసదారులపైనా ట్రంప్ కన్నెర్ర చేశారు. అమెరికా వ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా వలసదారులకు తాత్కాలిక నివాస హోదాను రద్దు చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంలాండ్ సెక్యూరిటీ సంచలన ప్రకటన చేసింది.

క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజువెలా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు చట్టపరమైన రక్షణను రద్దు చేస్తున్నట్లు హోంలాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్లు తెలిపింది. 2022 అక్టోబరు తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన దాదాపు 5,32,000 మందికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి.

మానవతా పెరోల్ కార్యక్రమం కింద అమెరికాకు వచ్చిన వారిపై ఈ కొత్త విధానం ప్రభావం చూపనుంది. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారని, రెండేళ్ల పాటు ఇక్కడ నివసించడానికి, పని చేయడానికి తాత్కాలిక అనుమతులు పొందారని హోంలాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్ట్ నోయెమ్ వెల్లడించారు. వీరు ఈ ఏడాది ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అగ్రరాజ్యంలో ఉండేందుకు లభించిన చట్టబద్ధ రక్షణను కోల్పోనున్నారని తెలిపారు.

మానవతా పెరోల్‌ను విస్తృతంగా దుర్వినియోగం చేస్తున్నారని, దీనికి ముగింపు పలుకుతామని ట్రంప్ ఇదివరకే వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ దిశగా తాజాగా అమెరికా సర్కారు చర్యలు చేపట్టింది. ఈ మానవతా పెరోల్ అనేది అమెరికాలో సుదీర్ఘకాలంగా ఉన్న వెసులుబాటు. యుద్ధం లేదా రాజకీయ అస్థిరత ఉన్న దేశాల ప్రజలు అమెరికాకు వచ్చి తాత్కాలికంగా నివాసం ఉండేందుకు వీలుగా అధ్యక్షుడు ఈ లీగల్ స్టేటస్‌ను కల్పిస్తారు. గతేడాది అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ దీని గురించి పలుమార్లు ప్రస్తావించారు. అక్రమ వలసదారులను బహిష్కరించడంతో పాటు కొందరు వలసదారులకు ఉన్న చట్టబద్ధమైన మార్గాలను కూడా ముగిస్తామని అప్పట్లో తెలిపారు.

అంతక్రితం ఉన్న నిబంధనల ప్రకారం... ఇలా మానవతా పెరోల్ కింద అమెరికాకు వచ్చే వారు, రెండేళ్ల పాటు చట్టబద్ధంగా దేశంలో ఉపాధి పొందొచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత మరింత ఎక్కువ కాలం ఉండేందుకు వీలుగా శరణార్థిగా లేదా వీసా కోసం దరఖాస్తు చేసుకునే సౌలభ్యం ఉండేది. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేశారు. దీన్ని సవాల్ చేస్తూ పలు ఫెడరల్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి.



# విరాట్ కోహ్లీ విధ్వంసం..

# కోల్‌కతాపై ఆర్‌సీబీ శుభారంభం!

ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) శుభారంభం చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో శనివారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో సమష్టిగా చెలరేగిన ఆర్‌సీబీ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. బౌలింగ్‌లో కృనాల్ పాండ్యా దుమ్మురేపితో బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ రఫ్ఫాడించాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 174 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే(31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. సునీల్ నరైన్(26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 44), అంగ్‌క్రిష్ రఘువంశీ(22 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 30) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఆర్‌సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా(3/29) మూడు వికెట్లు తీయగా.. జోష్ హాజెల్ వుడ్(2/22) రెండు వికెట్లు పడగొట్టాడు. సుయాశ్ శర్మ, రసిఖ్ సలామ్, యశ్ దయాల్ తలో వికెట్ తీసారు. రహానే- నరైన్ ధాటికి ఓ దశలో కేకేఆర్ 220 ప్లస్ స్కోర్ చేసేలా కనిపించింది. కానీ కృనాల్ పాండ్యా సంచలన బౌలింగ్‌తో కేకేఆర్‌ను సాధారణ స్కోర్‌కే కట్టడి చేశాడు.

## అదిరిపోయే ఆరంభం..

175 పరుగుల లక్ష్య ఛేధనలో ఆర్‌సీబీ అదిరిపోయే ఆరంభం దక్కింది. తొలి ఓవర్ నుంచే ఓపెనర్ ఫిల్ సాల్ట్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.. కోహ్లీ కూడా అతనితో పోటీ పడి బౌండరీలు బాదాడు. దాంతో ఆర్‌సీబీ పవర్ ప్లేలోనే వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది. అనంతరం కేకేఆర్ స్పిన్నర్లను బరిలోకి దించగా.. ఈ జోడీ అదే జోరు కనబర్చింది. ఈ క్రమంలో ఫిల్ సాల్ట్ 25 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ధాటిగా ఆడే క్రమంలో వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో ఫిల్ సాల్ట్ క్యాచ్ ఔటవ్వడంతో తొలి వికెట్‌కు నమోదైన 95 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

## కోహ్లీ విధ్వంసం..

క్రీజులోకి దేవదత్ పడిక్కల్ రాగా.. . ఆర్‌సీబీ 9.5 ఓవర్లలో 100 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దూకుడుగా ఆడే ప్రయత్నంలోనే పడిక్కల్(10) ఔటవ్వగా.. బ్యాటింగ్‌కు వచ్చిన రజత్ పటీదార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. భారీ షాట్లతో వేగంగా పరుగులు చేశాడు. విజయం ముంగిట అతను ఔటవ్వగా.. లివింగ్ స్టోన్(15 నాటౌట్) తనదైన షాట్లతో విజయ లాంఛానాన్ని పూర్తి చేశాడు.


## విధ్వంసకర బ్యాటింగ్..


ఆర్‌సీబీ 16.2 ఓవర్లలో 3 వికెట్లకు 177 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లీ(36 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్), ఫిల్ సాల్ట్(36 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ రజత్ పటీదార్(16 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 34 ) దూకుడుగా ఆడాడు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, వైభవ్ అరోరా తలో వికెట్ తీసారు.



# అట్టహాసంగా ఐపీఎల్ ఆరంభం వేడుకలు!







అదిరిపోయే ఆరంభ వేడుకల మధ్య ఐపీఎల్ 2025 సీజన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ఆరంభ వేడుకలను బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ ప్రారంభించగా.. ప్రఖ్యాత సింగర్ శ్రేయా ఘోషల్ తన మధురమైన పాటలతో అలరించారు. ఆమి ఝే తోమర్ పాటతో మొదలు పెట్టిన శ్రేయా.. మా తుఝే సలాం సాంగ్‌తో తన ప్రదర్శనను ముగించారు.

తన ప్రత్యేకమైన పాటను 10 ఫ్రాంచైజీలకు అంకితమిచ్చారు. అయితే ఆడియో క్వాలిటీ సరిగ్గా లేదని స్టేడియంలోని చాలా మంది అభిమానులు ఫిర్యాదు చేశారు. అనంతరం దిశా పటానీ తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. పలు హిందీ సాంగ్స్‌కు దిశా పటానీ చిందేసింది. ఆ తర్వాత ప్రముఖ ర్యాపర్ కరణ్ ఆజ్లా తన గాత్రంతో అభిమానులను అలరించాడు.

అనంతరం షారూఖ్ ఖాన్ ఈ వేడుకలకు హోస్ట్‌గా వ్యవహరించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీని స్టేజీపైకి ఆహ్వానించాడు. 18 సీజన్లుగా ఆడుతూ అద్భుత ప్రదర్శన కనబర్చిన ఆటగాడిగా అతనిపై ప్రశంసల జల్లు కురిపించాడు. కోహ్లీతో సరదాగా మాట్లాడిన షారూఖ్ ఖాన్.. అనంతరం కేకేఆర్ సెన్సేషన్ రింకూ సింగ్‌ను కూడా స్టేజీపైకి ఆహ్వానించాడు.

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి గోల్డెన్ జనరేషన్ ఆటగాళ్లకు కుర్రాళ్లు పోటీ ఇస్తారా? అని రింకూ సింగ్‌ను ప్రశ్నించగా.. తాను కూడా ఆ జనరేషన్ ఆటగాడినేని, వాళ్లు ఓల్డ్ జనరేషన్ కాదని బదులిచ్చాడు. అనంతరం రింకూ సింగ్‌తో కలిసి షారూఖ్ ఖాన్ డ్యాన్స్ చేయగా.. విరాట్ కోహ్లీ పడి పడి నవ్వుకున్నాడు. ఆ తర్వాత కోహ్లీ కూడా షారూఖ్‌తో కలిసి డ్యాన్స్ చేశాడు.

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ!




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో నాలుగు జట్లపై 1000 ప్లస్ రన్స్ చేసిన తొలి ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో శనివారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ ఫామ్‌ను కొనసాగిస్తూ విరాట్ కోహ్లీ(36 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగాడు.

ఈ క్రమంలోనే కేకేఆర్‌పై 1000 పరుగుల మైలురాయిని పూర్తి చేసుకున్నాడు. కేకేఆర్‌తో పాటు పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లపై కూడా వెయ్యికి పైగా పరుగులు చేశాడు. కోహ్లీ మినహా మరే ఆటగాడు ఐపీఎల్‌లో ఈ ఫీట్ సాధించలేదు. డేవిడ్ వార్నర్.. పంజాబ్ కింగ్స్, కేకేఆర్‌లపై మాత్రమే 1000 ప్లస్ రన్స్ చేయగా.. రోహిత్ శర్మ(కేకేఆర్, ఢిల్లీ క్యాపిటల్స్), శిఖర్ ధావన్ చెన్నై సూపర్ కింగ్స్‌పై మాత్రమే 1000 ప్లస్ రన్స్ చేశాడు.

## కోహ్లీ@400

ఈ మ్యాచ్‌తో విరాట్ కోహ్లీ టీ20 ఫార్మాట్‌లో 400 మ్యాచ్‌ల మైలురాయిని అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. రోహిత్ శర్మ 448 మ్యాచ్‌లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. దినేశ్ కార్తీక్ 412 మ్యాచ్‌లతో కోహ్లీ కంటే ముందున్నాడు.

## 98 హాఫ్ సెంచరీలు..

400 టీ20ల్లో విరాట్ కోహ్లీ 98 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. ఇందులో 9శతకాలు కూడా ఉన్నాయి. ఐపీఎల్‌లోనే అతను 38.95 సగటుతో 8063 పరుగులు చేశాడు. ఇందులో 8 శతకాలతో పాటు 56 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

చైతన్య రథం సినిమా

ఆదివారం 23 మార్చి 2025



బ్లో అప్

తమన్నా



## నెట్‌ఫ్లిక్స్‌లో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'..

తమిళ హీరో కమ్ డైరెక్టర్ ప్రదీప్ రంగనాథ్ నటించిన రీసెంట్ మూవ 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' తెలుగులో మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాను పూర్తి యూత్‌ఫుల్ కథగా దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కించగా అందాల భామలు అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్ హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమాతో కయాదు లోహర్ ఒక్కసారిగా సెన్సేషనల్ క్రేజ్ దక్కించుకుంది.

ఇక ఆమెకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఏర్పడింది. కాగా ఇప్పుడు ఈ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ విషయాన్ని కయాదు ఓ వీడియో రూపంలో ప్రమోట్ చేసింది. థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో ఇంటిల్లిపాదిని అలరిస్తుందని ఆమె చెప్పుకొచ్చింది.

ఈ వీడియోలో ఆమె క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమాను ఓటీటీలో చూసేందుకు ప్రేక్షకులు కూడా ఆసక్తిని చూపుతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది.

## మరోసారి నితిన్‌కి జోడిగా కీర్తి సురేష్



*కీర్తి సురేష్ గత కొన్నేళ్లుగా తెలుగు సినిమాలకు కొంత దూరంగా ఉంది. 2023 తర్వాత టాలీవుడ్‌లో కొత్త ప్రాజెక్టులు అంగీకరించడం తగ్గించింది. ఇదే సమయంలో ఆమె వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఈ గ్యాప్ కారణంగా ఇక ఆమె తెలుగు పరిశ్రమకు పూర్తిగా గుడ్‌బై చెబుతుందని అనుకున్నారు. అయితే సినిమాల సంఖ్య తగ్గించినా.. కెరీర్ను మాత్రం కొనసాగిస్తోంది. తెలుగు కంటే తమిళం, హిందీ చిత్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. కానీ ఇప్పుడు మళ్లీ టాలీవుడ్లో అవకాశం కోసం దృష్టిపెట్టింది. త్వరలోనే నితిన్ సరసన నటించే అవకాశం కీర్తి సురేష్‌కు దక్కనున్నట్లు తెలుస్తోంది. బలగం ఫేమ్ వేణు దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించనున్న ఎల్లమ్మ సినిమాలో ఆమె హీరోయిన్గా ఎంపిక కాబోతోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.*

*ఇప్పటి వరకు ఈ సినిమాలో ప్రధాన కథానాయికగా సాయిపల్లవి పేరు వినిపించింది. కానీ రామాయణ్ హిందీ చిత్రంతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చింది. దీంతో ఆ అవకాశం కీర్తి సురేష్ను వరించింది. గతంలో రంగ్ దే సినిమాలో నితిన్, కీర్తి సురేష్ జంటగా నటించారు. ఇప్పుడు ఎల్లమ్మలో మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఈ సినిమా తన కెరీర్‌కు భారీ టర్నింగ్ పాయింట్ అవుతుందని నితిన్ భారీ అంచనాలతో ఎదురుచూస్తున్నాడు. మరి కీర్తి సురేష్ టాలీవుడ్‌లో మళ్లీ సత్తా చాటుతుందా..? వేచి చూడాలి.*

## అట్లీ-బన్నీ సినిమాపై.. త్వరలో అధికారిక ప్రకటన



అల్లు అర్జున్, అట్లీ కలయికలో ఓ భారీ సినిమా రూపొందుతున్న విషయం అందరికీ తెలిసిందే. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. ప్రస్తుతం అల్లు అర్జున్ దుబాయ్‌లో ఉన్నారు. అక్కడ చిత్రబృందంతో కథా చర్చలు జరుపుతున్నారని సమాచారం. భారతదేశానికి తిరిగి వచ్చిన అనంతరం ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

ఇన్నాళ్లుగా ఈ సినిమాపై ఎన్నో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్లో కనిపించనున్నారు. అందులో ఒకటి పూర్తిగా నెగటివ్ షేడ్స్ కలిగిన పాత్రగా ఉండనుందట. విలన్ రేంజ్లో ఉండే ఈ క్యారెక్టర్ బన్నీ నటనకు కొత్త మైలురాయిగా నిలిచేలా ఉంటుందని టాలీవుడ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఇప్పటికే పుష్పలో అల్లు అర్జున్ పాత్రకు కొంత నెగటివ్ షేడ్ ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సినిమా పాత్ర కోసం ఆయనకు పెద్దగా కొత్తగా అలవాటు చేసుకోవాల్సిన అవసరం లేదని అంటున్నారు. మరోవైపు త్రివిక్రమ్ కూడా తన తదుపరి సినిమాపై కసరత్తులు కొనసాగిస్తున్నారు. దుబాయ్ నుంచి బన్నీ తిరిగి వచ్చిన తర్వాత త్రివిక్రమ్ ఆయన ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఆ తర్వాత బన్నీ తన కొత్త ప్రాజెక్ట్‌పై స్పష్టమైన ప్రకటన ఇవ్వనున్నారు.

ఈ సినిమా అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ అట్లీ-బన్నీ కాంబో ఎంతటి సంచలనాన్ని క్రియేట్ చేస్తుందో చూడాలి.

## 28న విడుదలకు సిద్ధమైన 'మ్యాడ్ స్క్వేర్'



టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన సీక్వెల్ చిత్రం 'మ్యాడ్ స్క్వేర్' సాలిడ్ క్రేజ్‌ను క్రియేట్ చేస్తుంది. గతంలో వచ్చిన 'మ్యాడ్' చిత్రానికి ఈ మూవీ సీక్వెల్‌గా వస్తుండటంతో ప్రేక్షకులలో ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నార్నె నితిన్, రామ్ నితిన్ లీడ్ రోల్స్ ప్లే చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్ అంచనాలను పెంచాయి. ఇక ఈ సినిమా ప్రమోషన్స్ కూడా యమ యాక్టివ్‌గా జరుగుతుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లోనూ మంచి ఆసక్తి క్రియేట్ అయ్యింది. ఇక ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు ఎంతో ఆతృతగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్ మై షోలో ఈ చిత్రానికి 50 వేలకు పైగా ఇంట్రెస్ట్‌లు రావడంతో పాటు ట్రెండింగ్ అవడమే దీనికి నిదర్శనమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాను దర్శకుడు కళ్యాణ్ శంకర్ డైరెక్ట్ చేయగా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య ప్రొడ్యూస్ చేస్తున్నారు. 28న ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

## సూర్య సరసన క్రేజీ హీరోయిన్





మలయాళంలో భారీ విజయం సాధించిన ప్రేమలు సినిమా తెలుగులోనూ మంచి రెస్పాన్స్‌ను అందుకుంది. ఎస్ఎస్ కార్తికేయ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఈ చిత్రం తెలుగు యువతకు బాగా కనెక్ట్ అయ్యింది. ఈ సినిమా విజయం తర్వాత హీరోయిన్ మమిత బైజు టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తెలుగు చిత్రసీమ నుంచి ఆమెకు మంచి అవకాశాలు వస్తున్నాయి. అయితే ఆమె ఎంపిక చేసే ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ నటిస్తున్న జన నాయగన్ చిత్రంలో మమిత ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా భగవంత్ కేసరి రీమేక్‌గా ప్రచారంలో ఉండగా.. ఇందులో మమిత శ్రీలీల పాత్ర తరహా కీలక పాత్రలో కనిపించనుందనే టాక్ ఉంది.

ఇక తాజా సమాచారం ప్రకారం సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త సినిమాలో మమిత బైజు హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రూపొందనున్న ఈ చిత్రం ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉంది. మొదట సూర్య సరసన భాగ్యశ్రీ బోర్సేను తీసుకోవాలని అనుకున్నా.. చివరికి మమిత బైజు ఈ అవకాశం దక్కించుకున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి.

సూర్య ప్రస్తుతం వాడివాసల్ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతున్నప్పటికీ.. ఈ సినిమా ఆలస్యం కావడంతో ముందుగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో సినిమా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మమిత ఇప్పటికే తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ ఈ సినిమా ద్వారా ఆమె స్టార్ హీరోయిన్గా ఎదిగే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## స్టన్నింగ్ లుక్స్‌తో మీనాక్షి చౌదరి

*హీరోయిన్ మీనాక్షి చౌదరి గత ఏడాది ఈ సమయంలో గుంటూరు కారం దెబ్బకి సైలెంట్ అయ్యింది. గుంటూరు కారం సినిమా రిజల్ట్ తో డిజప్పాయింట్ అవడం కాదు, ఆ చిత్రంలో ఆమె కేరెక్టర్ చూసి ఆమెకే నిరాశ కలిగి ఉంటుంది. ఆతర్వాత కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ GOAT కూడా మీనాక్షి చౌదరిని ఇరకాటంలో పడేసింది. ఆ తర్వాత లక్కీ భాస్కర్‌తో 100 కోట్ల హీరోయిన్‌గా మారిన మీనాక్షి చౌదరి, ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం చిత్రంతో 300 కోట్ల క్లబ్బులో అడుగుపెట్టింది. ఆ తర్వాత ఆమె టాలీవుడ్ ప్రేక్షకులకి లక్కీ హీరోయిన్‌గా కనిపించింది. అయితే మీనాక్షి చౌదరి ఆశించిన అవకాశాలు మాత్రం రావడం లేదు. ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి అనగనగ ఒక రాజు తప్పితే ఆమెకి టాలీవుడ్ లో మరో ప్రాజెక్ట్ లేదు.*

*సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు లేటెస్ట్ లుక్స్‌ని పోస్ట్ చేసే మీనాక్షి చౌదరి ఎక్కువగా గ్లామర్‌కే ప్రాధాన్యత ఇస్తుంది. మీనాక్షి తాజాగా రెడ్ డ్రెస్‌లో మోడ్రన్‌గా కనిపించింది. చూపులతో కాల్చేస్తుందా అన్నట్టుగా మీనాక్షి లేటెస్ట్ లుక్ ఉంది. ప్రస్తుతం మీనాక్షి రెడ్ లుక్ నెట్టింట వైరల్ అవుతుంది.*

